ఈనాడు
అన్నమయ్య
మంగళవారం అక్టోబరు 1, 2024

నియంత్రికల్లో అవినీతి షాక్!

కడపకు చెందిన సంస్థకు దోచిపెట్టే వ్యవహారం

ఉమ్మడి జిల్లాలో వెలుగులోకి అక్రమాలు

ఎస్పీడీసీఎల్ సరఫరా చేసే విద్యుత్తు నియంత్రికల్లో అవినీతి షాక్ కొడుతోంది. కడప నగరానికి చెందిన ఓ సంస్థకు దోచిపెట్టే క్రమంలో అక్రమాల పరంపర కొనసాగుతోంది. గత వైకాపా ప్రభుత్వానికి అంటకాగిన సదరు సంస్థ నియంత్రికలు, ఇతరత్రా పరికరాలను మరో ఏడాది కాలానికి కావాల్సిన మేరకు సరఫరా చేసేసింది. వైకాపా ప్రభుత్వం దిగిపోయే అవకాశాలు గ్రహించి ముందుగానే భారీగా ఎస్పీడీసీఎల్ స్టోర్లలో దింపేసింది. క్షేత్రస్థాయిలోనూ అవసరమున్నా, లేకున్నా విద్యుత్తు నియంత్రికలు అమర్చేస్తున్నారు. కొందరు అధికారులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా అవినీతికి పాల్పడుతూ సర్వీసు మంజూరు కాని వారికి అంటగట్టేస్తున్నారు. - ఈనాడు, కడప, న్యూస్‌టుడే, రాజంపేట గ్రామీణ


కడప ఎస్పీడీసీఎల్ స్టోర్స్‌లో భారీగా ఉన్న విద్యుత్తు నియంత్రికల నిల్వలు

కడప నగరంలో ఎస్పీడీసీఎల్ స్టోర్ ఉంది. అక్కడ మరో ఏడాదికి అవసరమైన విద్యుత్తు నియంత్రికలు, పరికరాల నిల్వలున్నాయి. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రాకముందే భారీగా తీసుకొచ్చి పెట్టేశారు. ఆ తర్వాత కూడా క్రమంగా నిల్వలు పెంచేశారు. 25 కేవీ విద్యుత్తు నియంత్రిక పక్క రాష్ట్రాల్లో రూ.70 వేలకు లభిస్తుండగా, ఇక్కడ మాత్రం రూ.1.60 లక్షల వరకు పెంచేశారు. గత వైకాపా సర్కారులో కీలక నేతకు అత్యంత సన్నిహితుడి కంపెనీకి లబ్ధి చేకూర్చడానికి ధరలతో పాటు ఇష్టారాజ్యంగా నియంత్రికలు, పరికరాలు సరఫరా బాధ్యతలు కట్టబెట్టారు. సరకు నిల్వపై ఫిర్యాదులు వెల్లువెత్తడంతో తిరుపతిలోని ఎస్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం నుంచి జీఎం శ్రీనివాసులు సోమవారం కడప నగరంలోని స్టోర్స్‌కు చేరుకుని విచారణ చేపట్టారు.

రాజంపేట మండలం మిట్టమీదపల్లెలోని జగనన్న కాలనీలో 2,666 ఇళ్లకుగానూ కేవలం 148 మాత్రమే నిర్మించారు. మిగిలినవి వివిధ నిర్మాణ దశల్లో నిలిచిపోయాయి. ఇతర మౌలిక సదుపాయాలు కల్పించక పోయినా విద్యుత్తు నియంత్రికలు, స్తంభాలు భారీగా ఏర్పాటు చేశారు. ఇంటి సర్వీసులకు 12, 16 కేవీ నియంత్రికలు అమర్చాల్సి ఉండగా, ఏకంగా 25 కేవీ సామర్థ్యం ఉన్నవి అధికం. వీటిల్లో 16 నియంత్రికలు అనవరంగా ఏర్పాటు చేశారు. వైకాపాకు చెందిన గుత్తేదారుకు లబ్ధి చేకూర్చేందుకు విద్యుత్తు నియంత్రికలు, స్తంభాలు, లైన్ల ఏర్పాటు బాధ్యతలు అప్పగించారు. దాదాపుగా అన్ని కాలనీల్లోనూ ఇదే విధంగా దందా సాగించారు. అవసరానికి మించిన నియంత్రికలు ఏర్పాటు చేసి ప్రజాధనాన్ని కొల్లగొట్టారు.


రాజంపేట మండలం మిట్టమీదపల్లెలో అవసరానికి మించి ఏర్పాటు చేసిన విద్యుత్తు నియంత్రికలు

రాజంపేట మండలం ఊటుకూరుకు చెందిన ఓ రైతుకు వ్యవసాయ సర్వీసు మంజూరు కాగా 25 కేవీ విద్యుత్తు నియంత్రికతో పాటు 33 కేవీ విద్యుత్తులైన్ తీగలు కేటాయించారు. వీటిని పెనగలూరు మండలం నల్లపురెడ్డిపల్లెకు చెందిన మరో రైతు నుంచి రూ.1.50 లక్షలు అక్రమంగా వసూలు చేసి అమర్చారు. సాధారణంగా విద్యుత్తు సర్వీసు మంజూరుకు మ్యాపింగ్ జరుగుతుంది. అనంతరం వరుస క్రమంలో సీనియారిటీ ఆధారంగా రైతులకు సర్వీసులు మంజూరు చేస్తారు. ఇక్కడ జరిగిన అక్రమంపై విజిలెన్స్ విచారణ జరిగింది. ఇటువంటి దందాలు ఉమ్మడి కడప జిల్లాలో భారీగా జరిగాయి.

కడప నగరం, బద్వేలు పట్టణాల్లో అనధికార లేఅవుట్లు వెలిశాయి. వీటికి విద్యుత్తు సర్వీసులు ఇవ్వడానికి నిబంధనలు వర్తించవు. ఆయా వెంచర్ల యజమానులతో అధికారులు, సిబ్బంది కుమ్మక్కై ఇష్టా రాజ్యంగా సర్వీసులతో పాటు నియంత్రికలు ఏర్పాటు చేశారు. ఇందులోనూ భారీగా అవినీతి జరిగింది. విద్యుత్తు సర్వీసుల ముసుగులో అనుమతులున్నట్లుగా చూపించి ఇళ్ల స్థలాల అమ్మకం చేపట్టి ప్రజలను మోసం చేశారు. ఈ వ్యవహారంలో అప్పట్లో పని చేసిన ఉన్నతాధికారుల హస్తం ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.


కడపలోని అనధికార లేఅవుట్‌లో ఏర్పాటు చేసిన విద్యుత్తు స్తంభాలు

తిరుమల లడ్డూ కల్తీపై ఆందోళన

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే: పవిత్రమైన తిరుమల లడ్డూను కల్తీ చేసి కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బతీసిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మదనపల్లెలో సోమవారం విశ్వహిందూపరిషత్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయం నుంచి ర్యాలీగా బయలుదేరి నెహ్రూబజార్, చిత్తూరు బస్టాండు మీదుగా సబ్‌కలెక్టర్ కార్యాలయం చేరుకుని నిరసన తెలిపారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, సభ్యులు ఆనంద్, మహేష్, బాలాజీ, భగవాన్, రవి కుమార్, పావని, ఇందిర, సురేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


మదనపల్లె సబ్‌కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న వీహెచ్‌పీ నాయకులు

పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ : కలెక్టర్

రాయచోటి, న్యూస్‌టుడే: జిల్లాలోని పోలింగ్ కేంద్రాలను నిబంధనల ప్రకారం హేతుబద్ధీకరిస్తున్నామని కలెక్టర్ శ్రీధర్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాలో సవరణపై ఇంటింటి సర్వే పూర్తయిందన్నారు. రాజంపేట నియోజకవర్గంలో నూతన పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయనున్నామని, రాయచోటి నియోజకవర్గంలో 8 పోలింగ్ కేంద్రాల స్థానాలను మార్పు చేస్తున్నామని ఆయన వివరించారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో ఒక పోలింగ్ కేంద్రం పేరు మార్చనున్నామని, మదనపల్లెలో రెండు పోలింగ్ కేంద్రాల స్థానాలు మార్పు చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో పింఛన్ల పంపిణీపై మాట్లాడుతూ వంద శాతం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. 1వ తేదీ ఉదయం 6 గంటల నుంచి పంపిణీ చేపట్టాలన్నారు. పింఛనుదారులు అందుబాటులో ఉండి సిబ్బంది ద్వారా పింఛను నగదు పొందాలని సూచించారు. పింఛన్ల పంపిణీ తీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని జిల్లాస్థాయి అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో సత్యనారాయణ, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నరసింహ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రాయచోటిని అభివృద్ధి చేస్తా

మంత్రి మండిపల్లి

రాయచోటి, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రం రాయచోటి పట్టణాభివృద్ధికి కృషి చేస్తానని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. రాయచోటి పురపాలక సంఘం కార్యాలయంలో సోమవారం చైర్మన్ ఫయాజ్ బాషా అధ్యక్షతన నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో మంత్రి మాట్లాడారు. రాయచోటి జిల్లా కేంద్రంగా ఉండదని కొందరు విష ప్రచారం చేస్తున్నారని, వాటిని నమ్మొద్దన్నారు. వెలిగల్లు తాగునీటి పథకం-2 నిర్మాణపనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. పట్టణంలో రెవెన్యూ స్థలాలు గుర్తించి సముదాయాల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ ఫయాజుర్‌రెహమాన్ మాట్లాడుతూ పట్టణంలో అధికంగా పన్నులు వసూలు చేస్తున్నారని చెప్పారు. స్థానిక సంస్థల ఆదాయం పెంపులో భాగంగానే పన్నులు వసూళ్లు ఉన్నాయని మంత్రి వివరించారు. ప్రభుత్వస్థలాలు, పాతబస్టాండు ప్రాంతంలో పురపాలక స్థలాలు ఆక్రమణకు గురయ్యాయని, వాటిని తొలగించి సముదాయాలు నిర్మించాలని కౌన్సిలర్ పి.మదన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలో సమస్యల పరిష్కారానికి మంత్రి చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ మాధవీలత, ఎస్‌ఎన్ కాలనీలో పారిశుద్ధ్యం నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని కౌన్సిలర్ విజయమ్మ సమావేశం దృష్టికి తీసుకెళ్లారు. అన్ని వార్డుల్లో పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని కమిషనర్ వాసుబాబు తెలిపారు. పట్టణంలో పాత విద్యుత్తు లైన్లు తొలగించి ప్రమాదాలు జరగకుండా చూడాలని మంత్రి ఎస్పీడీసీఎల్ అధికారులను ఆదేశించారు. అనంతరం పురపాలక సంఘంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. సమావేశంలో అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

పేదలకు అత్యాధునిక వైద్యమే లక్ష్యం

వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్

సర్వజన ఆసుపత్రి, న్యూస్‌టుడే: కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి వచ్చే రోగులకు పూర్తి స్థాయిలో అత్యాధునిక వైద్యం అందించడమే లక్ష్యంగా వైద్యులు, వైద్య సిబ్బంది అంకితభావంతో పని చేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. కడప ప్రభుత్వ దంత వైద్య కళాశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన మినీ ఆడిటోరియం, అత్యవసర దంత క్లినిక్, సెంట్రల్ ల్యాబ్‌లో అత్యాధునిక పరికరాలను సోమవారం మంత్రి ప్రారంభించారు. అనంతరం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో రూ.6 కోట్లతో ఏర్పాటు చేసిన క్యాథ్‌ల్యాబ్‌ను ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, కడప ఎమ్మెల్యే మాధవి, జేసీ అదితిసింగ్‌తో కలిసి ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ దంత వైద్య కళాశాలలోని పలు సమస్యలు తమ దృష్టికి వచ్చాయని, దశలవారీగా పరిష్కారానికి కృషి చేస్తామని వివరించారు. ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు వైద్యసేవలు ఎలాంటి ఇబ్బందులు రాకుండా, పరికరాలు, సౌకర్యాల కల్పనకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఎమ్మెల్యే మాధవిరెడ్డి మాట్లాడుతూ గతంలో కంటే ప్రస్తుతం ఆసుపత్రుల్లో వైద్యసేవలు మెరుగ్గా అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఆర్డీ డాక్టర్ శ్రీనివాసులు, డీఎంహెచ్‌వో డాక్టర్ నాగరాజు, వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సురేశ్వర్‌రెడ్డి, సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ హిమదేవి, కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, భాజపా జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి, వైద్యులు, వైద్య విద్యార్థులు, తెదేపా, జనసేన, భాజపా నాయకులు పాల్గొన్నారు.


దంత వైద్య కళాశాలలో అత్యవసర క్లినిక్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్, పక్కన ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి, తెదేపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి తదితరులు

కడప-బెంగళూరు రైల్వేలైన్ పూర్తిచేయండి

రాయచోటి, న్యూస్‌టుడే: కడప-బెంగళూరు రైల్వేలైన్ నిర్మాణ పనులు పూర్తి చేయాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట సోమవారం సీపీఐ నాయకులు ధర్నా నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, సహాయ కార్యదర్శి మహేష్ మాట్లాడుతూ 2006-07 మధ్య కాలంలో అప్పటి సీఎం వైఎస్ఆర్ హయాంలో కేంద్ర ప్రభుత్వం రైల్వేలైన్ ఏర్పాటుకు బడ్జెట్‌లో ఆమోదం తెలిపిందన్నారు. నాలుగు దశల్లో అయిదేళ్ల కాలంలో పూర్తి చేయాలని ప్రణాళికలు సిద్ధం చేశారన్నారు. మొదటి దశలో రూ.150 కోట్లు కేటాయించగా భూ సేకరణకు రూ.20 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని గుర్తు చేశారు. కడప నుంచి పెండ్లిమర్రి వరకు రైల్వేపట్టాలు వేశారన్నారు. అనంతరం ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో గత 15 ఏళ్లుగా పనులు నిలిచిపోయాయన్నారు. ఎన్డీయే ప్రభుత్వం చొరవ తీసుకుని కడప-బెంగళూరు రైల్వేలైన్ నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సుమిత్ర, సీపీఐ నాయకులు జగన్, ఆంజనేయులు, బాబ్జాన్ తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

అంజన్నా... ఆలయ పునర్నిర్మాణం ఎప్పుడన్నా?


అసంపూర్తిగా ఆలయ నిర్మాణ పనులు

వేంపల్లె, చక్రాయపేట, న్యూస్‌టుడే : ఉమ్మడి కడప జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం గండి క్షేత్రంలో ఆలయ పునర్నిర్మాణ పనులు నత్తతో పోటీపడుతున్నాయి. రూ.26 కోట్ల నిధులతో మూడేళ్ల కిందట చేపట్టిన పనులు కొనసాగుతూనే ఉన్నాయి. గత వైకాపా ప్రభుత్వ హయాంలో బిల్లుల చెల్లింపుల్లో తీవ్ర జాప్యం, అధికారుల ముందుచూపు లేకపోవడం, గుత్తేదారుల నిర్లక్ష్యంతో పనుల్లో జాప్యం జరుగుతోంది. పనులను 2020, డిసెంబరు 24న అప్పటి సీఎం జగన్ ప్రారంభించగా, తమిళనాడుకు చెందిన గుత్తేదారు సంస్థ పనులు దక్కించుకుంది. పాత ఆలయాన్ని కూల్చేయడంతో 2021, అక్టోబరులో బాలాలయాన్ని నిర్మించి స్వామి దారువు విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు ప్రారంభించారు. ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా 130 రాతి స్తంభాలు, గర్భాలయం, తూర్పు, పడమర రాజగోపురాలు, ప్రాకారం లోపల బండపరుపు, తదితర పనులు చేపట్టాల్సి ఉంది. గుత్తేదారు సంస్థకు రూ.18.50 కోట్ల వరకు బిల్లులు చెల్లించగా, నిధుల మంజూరు మేరకు పనులు పూర్తికాలేదని భక్తులు వాపోతున్నారు. ఈ విషయమై దేవాదాయశాఖ ఏఈఈ మిట్టా వెంకటనిఖిల్ మాట్లాడుతూ ఆలయ పునర్నిర్మాణం ఈ ఏడాది జులై చివరి నాటికి పనులు పూర్తికావాల్సి ఉందని, నిర్మాణంలో కొన్ని మార్పులు, చేర్పులు, బిల్లుల చెల్లింపుల్లో జాప్యంతో పనులు మందకొడిగా సాగుతున్నాయన్నారు.

పరిహారం చెల్లించాలని ముదివేడు నిర్వాసితుల ధర్నా

రాయచోటి, న్యూస్‌టుడే: ప్రభుత్వం తమకు వెంటనే పరిహారం చెల్లించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట సోమవారం ముదివేడు జలాశయం నిర్వాసితులు ధర్నా నిర్వహించారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు డిమాండు చేశారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించాలన్నారు. గత ప్రభుత్వం జలాశయం పేరుతో పలు అవకతవకలకు పాల్పడిందని ఆరోపించారు. సుమారు 780 ఎకరాల భూములకు రూ.108 కోట్ల నష్టపరిహారం చెల్లించాలని ప్రకటించినా అమలు చేయలేదన్నారు. కురబలకోట, బి.కొత్తకోట మండలాల్లోని అయిదు గ్రామాలు ముంపునకు గురవుతున్నా బాధితులకు ఒక్క రూపాయి ఇవ్వలేదన్నారు. పొలాల్లో మట్టిని తవ్వేయడంతో సాగుకు పనికి రాకుండాపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. నివాసాలు కోల్పోయిన ప్రతి కుటుంబానికి 5 సెంట్ల స్థలం, రూ.25 లక్షలు ఇవ్వాలని డిమాండు చేశారు. అనంతరం కలెక్టర్ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మణి, నిర్వాసితుల సంఘం నాయకులు సురేంద్రారెడ్డి, ముక్తుమ్‌బాషా, ప్రభాకర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


నినాదాలు చేస్తున్న ముదివేడు జలాశయం నిర్వాసితులు

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని నిరసన

రాయచోటి, న్యూస్‌టుడే: తమను క్రమబద్ధీకరించాలని డిమాండు చేస్తూ కలెక్టరేట్ ఎదుట సోమవారం ఒప్పంద ఉద్యోగులు నిరసన కార్యక్రమం చేపట్టారు. సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్ర శేఖర్, రామాంజులు మాట్లాడుతూ ఉద్యోగులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండు చేశారు. తక్షణం కనీస వేతన సలహా మండలిని నియమించి వేతన సవరణ చేయాలని కోరారు. 15వ ఆర్థిక సంఘం నిధుల్లో 50 శాతం హరిత రాయబారులకు వేతన బకాయిల చెల్లింపులకు వినియోగించాలన్నారు. అన్ని కార్మిక వర్గాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయం చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో విద్యుత్తు కార్మిక సంఘం నాయకులు సుబ్రహ్మణ్యంరాజు, నారాయణ, ప్రకృతి వ్యవసాయ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మధుకర్, సమగ్రశిక్ష అభియాన్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మురళీ మోహన్‌రాజు, పురపాలక సంఘం ఉద్యోగుల సంఘం నాయకులు లక్ష్మీదేవి, అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం నాయకులు ఓబులమ్మ, డి.భాగ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఒప్పంద ఉద్యోగులు

విద్యుత్తు నియంత్రికల ఏర్పాటుపై ఎస్ఈ విచారణ

పెద్దతిప్పసముద్రం, న్యూస్‌టుడే : పీటీఎం విద్యుత్తు ఉపకేంద్రంలో సోమవారం తిరుపతి ఎస్పీడీసీఎల్ ఎస్ఈ ఆదిశేషయ్య విచారణ చేపట్టారు. తంబళ్లపల్లె నియోజకవర్గం పీటీఎం మండలంలో విద్యుత్తు నియంత్రికలు అందలేదని నవాబుకోట పంచాయతీ పెద్దపొంగుపల్లెకు చెందిన ఆంజనేయరెడ్డి శనివారం ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విచారణకు విద్యుత్తు శాఖ ఉన్నతాధికారులను ఆదేశించడంతో ఎస్ఈ ఆదిశేషయ్య విచారణ చేపట్టారు. పలువురు రైతుల నుంచి వినతులు స్వీకరించారు. విద్యుత్తు నియంత్రికలకు ఏళ్లుగా దరఖాస్తు చేసుకున్నా ఇప్పటికీ ఇవ్వలేదని, వైకాపా కార్యకర్తలు మూడు నెలలు మందు డబ్బులు చెల్లిస్తే వారికి ఇచ్చారని ఫిర్యాదు చేశారు. రైతులు నుంచి ప్రతిఘటనలు ఎదురవుతుండడంతో గుట్టు చప్పుడు కాకుండా అధికారులు బదిలీపై వెళ్లిపోయారని ఫిర్యాదు చేశారు. రైతుల నుంచి లిఖితపూర్వకంగా ఫిర్యాదులు తీసుకున్నామని, రుజువైతే చర్యలు తీసుకుంటామని ఎస్ఈ తెలిపారు. ఆయనవెంట ఈఈ దామోదరం, డీఈ శ్రీనివాస్‌బాబు, ఏడీఈ సురేష్, తదితరులున్నారు.


పీటీఎం విద్యుత్తు ఉపకేంద్రం వద్ద విచారణ జరుపుతున్న ఎస్పీడీసీఎల్ ఎస్ఈ ఆదిశేషయ్య

హార్సిలీహిల్స్ పర్యాటకులపై టోల్‌గేటు భారం

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌కు వచ్చే పర్యాటకులపై టోల్‌గేటు భారం పెరిగింది. మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం టోల్‌గేటు వేలం పాట నిర్వహణలో అనిల్‌కుమార్‌నాయుడు రూ.45.20 లక్షలకు దక్కించుకున్నారు. కొండ దిగువన ఉన్న టోల్‌గేటు వద్ద ఇప్పటివరకు ద్విచక్ర వాహనదారుడి నుంచి రూ.30 చొప్పున తీసుకుంటుండగా, ఇకపై రూ.50 వసూలు చేయనున్నారు. బస్సుల నుంచి వసూలు చేస్తున్న ప్రవేశ రుసుమును రూ.170 నుంచి రూ.200లకు పెంచారు. గతంలో మాదిరిగానే ఆటోలకు రూ.70, కార్లకు రూ.100 వసూలు చేయనున్నట్లు మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ ప్రకటించారు. గతేడాది వేలంపాటలో రూ.27.30 లక్షలు దక్కించుకోగా, ఈసారి రూ.45.20 లక్షలకు చేరుకోవడం గమనార్హం.

రాయచోటి నుంచి తిరుమలకు బస్సులు

పీలేరు, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రమైన రాయచోటి నుంచి తిరుమలకు త్వరలో రెండు ఆర్టీసీ బస్సులు నడుపుతామని జిల్లా ప్రజారవాణాసంస్థ అధికారి రాము అన్నారు. పీలేరు ఆర్టీసీ డిపోను సోమవారం ఆయన తనిఖీ చేశారు. రాజంపేట డిపోలో త్వరలో పెట్రోలుబంకు ప్రారంభిస్తామని, పీలేరు, కలికిరి బస్టాండ్లలోనూ పెట్రోలు బంకుల ఏర్పాటుకు స్థల పరిశీలన చేస్తున్నామని వెల్లడించారు. జిల్లాకు 40 కొత్త బస్సులు రావాల్సి ఉండగా, 14 మాత్రమే వచ్చాయని, త్వరలో మిగిలినవి వస్తాయన్నారు. పీలేరు, మదనపల్లె, రాజంపేట, పులివెందుల ప్రాంతాల నుంచి తిరుమలకు ఆర్టీసీ బస్సులు నడపాలని ప్రజలను నుంచి వినతులు వస్తున్నాయని ఉన్నతాధికారుల నుంచి అనుమతులొచ్చిన అనంతరం పరిశీలిస్తామన్నారు. అనంతరం పీలేరు ఆర్టీసీ కార్యాలయంలో మరుగుదొడ్లను పరిశీలించి అపరిశుభ్రతపై ఆగ్రహించారు. వెంటనే పారిశుద్ధ్య పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆయనవెంట డీఎం కుమార్, సీఐ సుబ్బమ్మ, బీఎస్ఎం బాబునాయక్ తదితరులున్నారు.

కందిపప్పు వచ్చేస్తోంది!

దసరా పండగ వేళ కార్డుదారులకు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం

\- న్యూస్‌టుడే, రాజంపేట పట్టణం, సుండుపల్లి

దసరా పండగ నాటికి రేషన్ కార్డుదారులకు కందిపప్పు పంపిణీ చేయాలని ఎన్డీయే ప్రభుత్వం ముందుకొచ్చింది. ముందు గోదాములకు సరఫరా చేసి అక్కడ నుంచి చౌక ధరల దుకాణాలకు పంపించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాల్లో చౌక ధరల దుకాణాలు 2,362 ఉన్నాయి. దారిద్ర్యరేఖకు దిగువనున్న వారికి ఇచ్చిన బియ్యం పత్రాలు 10,91,176 ఉండగా, లబ్ధిదారులు 32,76,098 మంది ఉన్నారు. గత వైకాపా ప్రభుత్వం నిత్యావసర సరకుల కోటాను కుదించి బియ్యం, పంచదారతో సరిపెట్టేసింది. బహిరంగ విపణిలో కంది పప్పు కిలో రూ.170 నుంచి రూ.180కు పైగా పలుకుతోంది. పేదలు కొనుగోలు చేయాలంటే ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అదిగో తెప్పిస్తున్నాం.. ఇదిగో తీసుకోండంటూ ఊరించి ఉసురుమనించి సామాన్యులకు పప్పన్నం దూరం చేసింది. ఎన్డీయే ప్రభుత్వం అధికారం చేపట్టాక వేలాది కుటుంబాలు లబ్ధి పొందుతున్న ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్ఠం చేయాలని ముందుకొచ్చింది. ఈ నెల నుంచి చౌక ధరల దుకాణాల్లో కందిపప్పును కిలో రూ.67కే పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు రెండు జిల్లాలకు కలిపి 625 మెట్రిక్ టన్నులు కేటాయించారు. జిల్లాలకు చేరుతున్న కందిపప్పును ఆయా ప్రాంతాల్లోని గోదాంలకు పంపిస్తున్నారు. డీలర్లను పిలిపించి తొలుత ఎండీయూ వాహనాల ద్వారా ఇస్తున్న ప్రాంతాలకు సర్దుబాటు చేస్తున్నారు. దసరా పండగ కానుకగా అందరికీ ఇవ్వాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశించడంతో పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టిసారించారు. కొన్ని నెలల తరువాత కందిపప్పు తక్కువ ధరకే అందుబాటులో వస్తోందని తెలిసి బడుగులు, శ్రమజీవులు ఉపశమనం పొందుతున్నారు. ప్రస్తుతానికి తాత్కాలికంగా తయారు చేసిన కవర్లలో కిలో వంతున నింపి పంపుతున్నారు. ఎక్కడికక్కడే తాత్కాలికంగా ముద్రించిన స్టిక్కర్లను ప్యాకెట్లను అతికించాలని అధికారులు ఆదేశించి రెండు జిల్లాల్లోని చౌక ధరల దుకాణాలకు సర్దుబాటు చేస్తున్నారు.



అంశం	వైఎస్ఆర్	అన్నమయ్య
చౌక ధరల దుకాణాలు	1,239	1,123
బియ్యం పత్రాలు	5,86,352	5,04,824
లబ్ధిదారులు	17,62,579	15,13,519
ఎండీయూ వాహనాలు	366	310
కందిపప్పు కేటాయింపు(టన్నుల్లో)	350	275

సరఫరాకు చర్యలు

ఈ నెల నుంచి చౌక ధరల దుకాణాల్లో కందిపప్పును పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించి కోటా కేటాయించింది. కార్డుదారులకు అవసరమైన కందిపప్పును తెప్పించడానికి చర్యలు తీసుకుంటున్నాం. దశలవారీగా నిర్దేశిత కోటా మేరకు తెప్పించి పంపిణీ చేస్తాం.

\- అర్జున్‌రావు, శివరామమూర్తి, డీఎంలు, పౌర సరఫరాలసంస్థ, వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాలు

రైతేరాజు 6లో


రైతేరాజు

చిట్కా..

పత్తిలో గులాబీ రంగు పురుగును నివారిద్దాం

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: పత్తి పంటలో అక్కడక్కడ 50 పువ్వులను పరిశీలిస్తే వాటిల్లో ఐదుకు గుడ్డి పూలు ఉన్నట్లయితే గులాబీ రంగు పురుగును ఆశించినట్లు రైతులు గుర్తించాలి. అదేవిధంగా పంటలో ఒక మొక్కకు ఒక కాయ చొప్పున మొత్తం 20 కాయలను సేకరించాలి. కోసినప్పుడు 20 కాయలకు రెండు గొంగళి పురుగులు ఉంటే నష్ట పరిమితి స్థాయిగా నిర్ధారించాలి. కాయ పైభాగంలో పురుగు బయటకు వచ్చే గుండ్రటి చిన్న రంధ్రం, కాయ తొనల మధ్య గోడలపై గుండ్రటి రంధ్రం ఉంటే ఈ పురుగుల వ్యాప్తి చెందినట్లు రైతులు గుర్తించాలి. గుడ్డి, రంగు మారిన పత్తిని గమనించిన వెంటనే కర్షకులు అప్రమత్తం కావాలి. పత్తి పొలం చుట్టూ తుత్తురు బెండ, ఉమ్మెత్త లాంటి ఆతిథ్యమిచ్చే కలుపు మొక్కలు లేకుండా చేయాలి. పత్తి పైరు సమీపంలో బెండ పంట ఉండరాదు. సేంద్రియ ఎరువులు, నత్రజని సత్తువల సమతుల్యత పాటించాలి. విత్తిన 45 రోజుల నుంచి గులాబీ రంగు పురుగు ఉనికిని గమనించడానికి ఎకరాకు నాలుగు లింగాకర్ష బుట్టలను ఏర్పాటు చేసుకోవాలి. వరుసగా బుట్టల్లో మూడు రోజులు పాటు పరిశీలించాలి. రోజుకు 8 రెక్కల పురుగులు ఉంటే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. గులాబీ రంగు పురుగు ఆశించిన గుడ్డి పూలు, రాలిన పూత, పిందెలను వెంటనే సేకరించాలి. సమూలంగా నాశనం చేయాలి. పురుగు ఉధృతి ఎక్కువగా వ్యాప్తి చెంది ఆర్థిక నష్ట పరిమితి స్థాయి దాటిన వెంటనే క్వినాల్‌ఫాస్ 25 ఇ.సి 2.5 మి.లీ లేదా ప్రొఫెనోఫాస్ 50 ఇ.సి 2 మి.లీ లేదా థయోడికార్బ్ 75 డబ్ల్యూపి 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. పంట ఆఖరి దశలో ఒకటి లేదా రెండుసార్లు మాత్రమే సింథటిక్ పైరిథ్రాయిడ్ మందులైన సైపర్‌మెథ్రిన్ 25 ఇ.సి 1 మి.లీ లేదా లామ్డా సైహాలోథ్రిన్ 5.0 ఇ.సి 1 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఈ పురుగు ఆశించిన పత్తిని రైతులు ఇళ్ల వద్ద, జిన్నింగ్‌మిల్లుల వద్ద గాని నిల్వ చేయరాదు. నీటి వసతి ఉన్నచోట పైరు కాలాన్ని ఆరు నెలలకు మించి పొడిగించరాదు.

- కె.సాయిమహేశ్వరి, శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం, ఊటుకూరు



సాగు చేసిన బొప్పాయి తోట



రైతులకు వరం... మహానంది కొర్ర రకం

చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే: వర్షాధార పంటల సాగులో ప్రత్యామ్నాయంతో పాటు తెగుళ్లను తట్టుకుని అధిక దిగుబడినిచ్చే మహానంది 3156, 3159 నూతన కొర్ర వంగడాలను ఇటీవల ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విడుదల చేసింది. దీంతో పాటు ఈ విత్తనాలను రైతులకిచ్చి క్షేత్రస్థాయిలో పంటలను బాగా సాగు చేయించడంతో మంచి ఫలితాలు వచ్చాయని ఊటుకూరు ఏరువాక కేంద్రం సమన్వయకర్త అంకయ్యకుమార్ తెలిపారు. కొత్త రకాలు, వాటి దిగుబడులను ఆయన వివరించారు.

మహానంది ఎస్ఐఏ-3156 రకం

ఈ రకం పంట సాగు చేసిన తర్వాత 85 నుంచి 90 రోజులకు పంట కోతకు వస్తుంది. కంకి పొడవుగా ఉండి అధిక దిగుబడినిస్తుంది. అగ్గితెగులు వెర్రికంకి తెగులును తట్టుకుంటుంది. నత్రజని ఎరువులను బాగా స్వీకరిస్తుంది. జాతీయ స్థాయిలో విడుదల చేసిన ఈ రకం ఎకరాకు 8 క్వింటాళ్ల నుంచి 10 క్వింటాళ్ల దిగుబడినిస్తుంది.

మహానంది ఎస్ఐఏ-3159: ఈ రకం పంట కాలపరిమితి 80 నుంచి 85 రోజులు. అగ్గి తెగులు, వెర్రికంకి తెగులు, మొవ్వ ఈగను కొంత వరకు తట్టుకుంటుంది. యాంత్రీకరణకు అనువైన రకం. ఎకరాకు 11 క్వింటాళ్ల నుంచి 12 క్వింటాళ్ల దిగుబడినిస్తుంది.

క్షేత్రస్థాయిలో ఉత్తమ ఫలితాలు: కొత్త కొర్ర రకాలను సాగు చేసి పరిశీలించారు. సికేదిన్నె మండలంలోని కమ్మవారిపల్లె పంచాయతీ పరిధిలోని గొర్లపల్లెలో రైతులు వెంకటరెడ్డి, భాస్కర్‌రెడ్డి తమ పొలంలో ఈ రకాలను సాగు చేశారు. మంచి దిగుబడితో పాటు నాణ్యత వచ్చే అవకాశం ఉందని వారు పేర్కొంటున్నారు.



పంటను పరిశీలిస్తున్న అధికారులు

బొప్పాయి సాగు... లాభాలు బాగు

రామసముద్రం, న్యూస్‌టుడే: రామసముద్రం మండలం శీతరగానిపల్లెకు చెందిన రైతు ఆనందప్ప ఆరు ఎకరాల విస్తీర్ణంలో బొప్పాయి సాగు చేపట్టారు. పొలాన్ని బాగా దుక్కి చేసి అందులో 90 ట్రాక్టర్ లోడ్ల పశువుల ఎరువు, పది కుంటల్ల వేప, కానుగ పిండిని మిశ్రమం చేసి దుక్కిలో కలిపేశారు. దుక్కి పదిహేను రోజుల పాటు ఉన్న తరువాత పది అడుగుల వెడల్పుతో బెడ్లు ఏర్పాటు చేశారు. బెడ్ల మధ్య మొక్కకు మొక్కకు ఏడు అడుగుల దూరంతో (రెడ్ లేడీ) హైబ్రిడ్ రకం మొక్కలు నాటారు. ఎకరా విస్తీర్ణంలో 900 మొక్కలు ఉండేలా జాగ్రత్త తీసుకున్నారు. మొక్కలకు బిందుసేద్యంతో సాగునీటిని అందించారు. తోటకు వీరపేనులు ఆశించిన వాటి నివారణకు క్రిమి సంహారక మందులు పిచికారీ చేసి కాపును తీసుకువచ్చారు. మొక్కలు నాటిన ఎనిమిది నెలలకు కాపు వచ్చింది. తెగుళ్లు కారణంగా కాపు తగ్గినా ఆరు ఎకరాల విస్తీర్ణంలో 70 టన్నుల వరకు దిగుబడి వచ్చింది. సాగుకు రూ.6 లక్షల వరకు ఖర్చు చేయగా తోట వద్దే కిలో బొప్పాయి రూ.15 వరకు ధర పలికింది. రైతుకు రూ.10 లక్షల వరకు రాబడి వచ్చింది. సాగు వ్యయం పోనూ రైతుకు రూ.4 లక్షల ఆదాయం సమకూరినట్లు తెలిపారు.

రైతు ప్రశ్న శాస్త్రవేత్త సమాధానం

ప్రశ్న: రబీ సీజన్‌లో మినుము పంటను సాగు చేయనున్నాం. విత్తనశుద్ధి కోసం ఏ రకం మందులను ఎంత మోతాదులో వాడాలో తెలియజేయండి?

- ఎస్.శివరామయ్య, రైతు, పెద్దముడియం

సమాధానం: కిలో మినుము విత్తనానికి ఇమిడాక్లోరోప్రిడ్ 5 మి.లీ లేదా థయోమిథాక్సామ్ 5 గ్రాములు, మాంకోజెబ్ 2.5 గ్రాములు లేదా కార్బండిజమ్ 2.5 గ్రాముల మందులను కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలి. భూమిలో విత్తనం వేయకముందే చేసుకుంటే విత్తిన 15-20 రోజుల వరకు పైరులో రసం పీల్చే పురుగుల బెడద ఉండదు. లేత పంటను తెగుళ్ల బారిన పడకుండా కాపాడుకోవచ్చు.

- డాక్టరు ఎ.వీరయ్య, సమన్వయకర్త, కృషి విజ్ఞాన కేంద్రం, ఊటుకూరు
- న్యూస్‌టుడే, ఒంటిమిట్ట


అర్జీదారుల సమస్యలు బాధ్యతాయుతంగా పరిష్కరించాలి

కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి, న్యూస్‌టుడే: అర్జీదారుల సమస్యలను అధికారులు బాధ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రతి సమస్యను, ప్రజల నుంచి వచ్చే వినతులను ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తోందన్నారు. అధికారులు అందరూ బాధ్యతగా ప్రజల సమస్యలను వంద శాతం పరిష్కరించాలన్నారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న బియాండ్ ఎస్ఎల్ఏ దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకుని పరిష్కరించాలన్నారు.

★ మదనపల్లెకు చెందిన రవీంద్ర తన కుమార్తె భవ్యశ్రీ పుట్టుకతో దివ్యాంగురాలని ఆమె జీవనాధారానికి చేయూతగా రూ.10 వేల పింఛను అందించాలని అర్జీ సమర్పించారు. వీరబల్లికి చెందిన చెన్నమ్మ తాను 65 ఏళ్లు నిండిన ఒంటరి మహిళనని తనకు వృద్ధాప్య పింఛను అందించాలని విన్నవించారు.

★ రాయచోటికి చెందిన హబీబ్ ఖాన్ తాను ట్రాన్స్‌జెండర్‌నని తనకు ఎటువంటి ఆధారం లేదని ఇంటి స్థలంతో పాటు పింఛను మంజూరు చేయాలని కోరారు. జిల్లాలోని అన్ని మండలాలలో ప్రతినెలా చివరి రోజు నిర్వహించాల్సిన సివిల్ రైట్స్‌డే కార్యక్రమాన్ని చేపట్టాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి సుధీర్‌కుమార్ కలెక్టర్‌కు విన్నవించారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను సంబంధిత అధికారులకు ఎండార్స్ చేసి నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. జేసీ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్వో సత్యనారాయణరావు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్, జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

ఉరుసు ఉత్సవాలు మతసామరస్యానికి ప్రతీకలు



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

సంబేపల్లె(రాయచోటి), న్యూస్‌టుడే: ఉరుసు ఉత్సవాలు మత సామరస్యానికి ప్రతీకలుగా నిలుస్తున్నాయని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సంబేపల్లె మండలం దేవళంపేట అగ్రహారం పొలిమేరలో ఉండే సయ్యద్ మస్తాన్ వలీషా మహబూబ్ సుబానీ దర్గా ఉరుసు ఉత్సవాలలో సోమవారం రాత్రి ఆయన పాల్గొన్నారు. మత గురువులు ఆయనకు స్వాగతం పలికారు. ఆధ్యాత్మికతను పెంపొందించేందుకు ఉత్సవాలు తోడ్పడతాయన్నారు. కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా, కమిటీ సభ్యులు ఎస్.సిలార్‌సాబ్, జిలానీ, కాలేషా, అబ్జల్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఎం.నరసారెడ్డి, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

హంద్రీనీవాతో చెరువులు నింపాలని వినతి



డీటీ మహమ్మద్ అన్సారీకి వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు, రైతులు

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: హంద్రీనీవా జలాలతో చెరువులను ఈ సీజన్లోనే నింపడానికి ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టాలని తంబళ్లపల్లె సీపీఐ ప్రాంతీయ కార్యదర్శి మనోహర్‌రెడ్డి డిమాండు చేశారు. జిల్లాలోని వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. పలు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం డీటీ మహమ్మద్ అన్సారీకి సీపీఐ నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. నాయకులు బషీర్‌ఖాన్, జి.రఘునాథ్, అష్రఫ్‌అలీ, సమీవుల్లా, గంగులప్ప, రైతులు పాల్గొన్నారు.

వినతుల స్వీకరణ

రాయచోటి, న్యూస్‌టుడే: చట్ట పరిధిలో సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు పేర్కొన్నారు. తన కార్యాలయంలో సోమవారం జిల్లాలోని పలువురు బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. సంబంధిత పోలీసు స్టేషన్ల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి సమస్యలు పరిష్కారం కాకపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు.



బాధితుడి సమస్యను వింటున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ నాయకులు సోమవారం మదనపల్లె డీవైఈవో శ్రీరామ పురుషోత్తానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ పాఠశాలల్లో ఎస్‌జీటీ, పండిట్, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలని, నవంబరులోగా మున్సిపల్ అప్‌గ్రేడ్ టీచర్లకు ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. అర్హులైన ప్రధానోపాధ్యాయులను అర్బన్ ఎంఈవోలుగా నియమించాలన్నారు. ఉపాధ్యాయులకు జీపీఎఫ్ ఖాతాలు తెరిపించాలని, నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించాలని పేర్కొన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ గౌరవాధ్యక్షుడు సుధాకర్‌నాయుడు, జిల్లా కార్యదర్శి పురం వెంకటరమణ, నాయకులు సుధాకర్, రవీంద్ర, రామచంద్ర, విజయకుమార్, దివాకర్, మున్సిపల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



డీవైఈవోకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

50 గ్రాముల బంగారు చోరీ

పెద్దమండ్యం: మండలంలోని సి.గొల్లపల్లె పంచాయతీ ధనరాజుగారిపల్లెలో సోమవారం ఓ ఇంట్లో తాళం పగులగొట్టి చోరీ చేశారు. గ్రామానికి చెందిన శ్రీనివాసులు ఇంటి తాళాలు పగులగొట్టి 50 గ్రాములు బంగారు, రూ, 50 వేలు నగదు చోరీ జరిగింది. ఈ మేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నకిలీ స్కౌట్స్, గైడ్స్ సంస్థలపై చర్యలు

కడప విద్య, న్యూస్‌టుడే : జిల్లాలో ప్రభుత్వ అనుమతి లేని నకిలీ స్కౌట్స్, గైడ్స్ సంస్థలు ఏదైనా కార్యక్రమాలు చేపడితే వాటిపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఈవో అనురాధ సోమవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులకు నకిలీ సంస్థలతో కలిగే ప్రమాదాల గురించి అవగాహన కలిగించి మోసాలకు గురికావొద్దని తెలిపారు. జిల్లాలోని పలు పాఠశాలల్లో నకిలీ స్కౌట్స్, గైడ్స్ సంస్థలు అనధికారికంగా కార్యకలాపాలు కొనసాగిస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. హిందూస్థాన్ స్కౌట్స్, గైడ్స్ ఆర్గనైజేషన్ (ఐహెచ్ఎస్‌జీవో) తప్పుడు వాగ్దానాలతో ప్రజలను మోసం చేస్తూ పాఠశాలల్లో కార్యకలాపాలను నిర్వహించే ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రపంచ స్కౌట్ ఉద్యమం (డబ్ల్యూవోఎస్ఎం) వరల్డ్, అసోసియేషన్ ఆఫ్ గర్ల్ గైడ్స్, గర్ల్ స్కౌట్స్ (డబ్ల్యూఏజీజీఎస్) అనుబంధ సంస్థగా ఉన్న భారత్ స్కౌట్స్, గైడ్స్ మాత్రమే అనుమతించిన సంస్థ అని తెలిపారు. మరే ఇతర సంస్థలకు అనుమతి లేదన్నారు.

ఉమ్మడి కడప జిల్లా సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ క్రీడాకారుల జట్ల ఎంపికలు

రాయచోటి, న్యూస్‌టుడే: రాయచోటిలోని మాసాపేట జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం ఉమ్మడి కడప జిల్లా అండర్-14, 17 బాలుర, బాలికల సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు హోరా హోరీగా జరిగాయి. జిల్లా స్థాయిలో ఎంపికైన జట్లు రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంయని వైఎస్సార్ జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ అరుణకుమారి, అన్నమయ్య జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ వసంతలు పేర్కొన్నారు. ఉమ్మడి కడప జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి అండర్-14, 17 సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ బాలుర, బాలికల జట్లు ఎంపిక చేశామన్నారు. న్యాయ నిర్ణేతలుగా జగదీశ్వరయ్య, శ్రీకాంత్‌రెడ్డి, గంగులయ్య, రమణలు వ్యవహరించారు. రాష్ట్ర స్థాయి పోటీలు అక్టోబరు నెలలో తిరుపతి, చిత్తూరు, అనంతపురం, కాకినాడలలో జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సుగవాసి ఈశ్వర్‌ప్రసాద్, పాఠశాల కమిటీ ఛైర్మన్ సుగవాసి ఆనంద్ బాబు, ప్రధానోపాధ్యాయుడు శివకుమార్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఎంపికైన అండర్-14 బాలుర జట్టు



ఎంపికైన అండర్-17 బాలుర జట్టు

రాజంపేట ట్రెజరీలో పురాతన నాణేల మాయం

రాజంపేట, న్యూస్‌టుడే: ట్రెజరీ కార్యాలయంలో పురాతన నాణేలు మాయమయ్యాయని అందిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని పట్టణ సీఐ యల్లమరాజు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 2021 సెప్టెంబర్‌లో దొరికిన 21 గ్రాములున్న 78 నాణేలను అప్పటి రాజంపేట తహసీల్దారు సీల్ వేసి ట్రెజరీలో డిపాజిట్ చేశారన్నారు. ఎన్నికల సమయంలో సీజ్ చేసిన రూ.12 వేలను ఓబులవారిపల్లి ఎస్ఐ రాజంపేట అదే ట్రెజరీలో డిపాజిట్ చేశారని వివరించారు. అవి కనిపించకపోవడంతో ఈ నెల 21న ట్రెజరీ అధికారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. లాకర్ వ్యవహారం ట్రెజరీ అధికారి పరిధిలోనే ఉంటుందని.. అలాంటప్పుడు అవి ఎలా పోతాయనే సందేహంతో తొలుత కేసు నమోదు చేయలేదని సీఐ వివరించారు. జిల్లా ట్రెజరీ అధికారి సూచనతో ట్రెజరీలో అటెండర్‌గా పనిచేస్తున్న ఓ వ్యక్తిపై అనుమానంతో కేసు నమోదు చేశామన్నారు. ట్రెజరీలో పురాతన నాణేలు, నగదు కనిపించలేదని చర్చ జరుగుతున్న రోజు నుంచి అటెండర్ విధులకు హాజరు కాకపోవడంతో ఆయనపై అనుమానం వ్యక్తం చేస్తూ కేసు నమోదు చేశామని సీఐ వివరించారు.

ఎస్టీ, ఎస్సీ భూములు అప్పగించాలి

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: కడప రామాంజనేయపురంలోని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల ఇళ్ల స్థలాలను పోలీసులు, రెవెన్యూ అధికారులు కూల్చేస్తున్నారని, తక్షణమే వాటిని ఆపాలని మహాజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్‌పీ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వైకే విశ్వనాథ్ సోమవారం జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌కు వినతిపత్రం అందించారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి విచారణ చేపట్టి న్యాయం చేయాలని, లేకపోతే కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్‌మాదిగ, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు రాజుమాదిగ, ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు బాబు, వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చిన్నసుబ్బయ్యయాదవ్, న్యాయవాదుల సమాఖ్య అధ్యక్షుడు పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

★ కడప కొప్పర్తిలో ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్‌ను తరలించకుండా ఇక్కడే ఏర్పాటు చేయాలనికోరుతూ డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ నేతృత్వంలోని బృందం జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు.

★ రిజిస్ట్రేషన్ శాఖల్లో పేరుకుపోయిన అవినీతి అక్రమాలను అరికట్టేలా చర్యలు తీసుకోవాలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఆర్టీఐ ఛైర్మన్ కోటిపాటి లక్షుమయ్య జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు.



జేసీకి వినతిపత్రం అందిస్తున్న ఎంఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు విశ్వనాథ్

దళితులపై దాడులను నిరసిస్తూ ఆందోళన

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ బీఎస్పీ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ మేరకు సోమవారం ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గౌతంకుమార్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ నేపథ్యంలో ఒకటోపట్టణ సీఐ చాంద్‌బాషా ధర్నా విరమించాలని సూచించారు. వారు వినకపోవడంతో బీఎస్పీ నాయకులను అదుపులోకి తీసుకుని ఠాణాకు తరలించి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న బీఎస్పీ నాయకులు

కేజీబీవీలో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కడప విద్య, న్యూస్‌టుడే : కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ)లలో ఖాళీగా ఉన్న బోధనా సిబ్బంది పోస్టులను ఒప్పంద ప్రాతిపదికన (కాంట్రాక్టు), బోధనేతర సిబ్బందిని పొరుగుసేవల (ఔట్‌సోర్సింగ్) ప్రాతిపదికన భర్తీచేయడానికి మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను కోరుతున్నట్లు జిల్లా సమగ్రశిక్ష అదనపు పథక సమన్వయకర్త అనురాధ ప్రకటనలో పేర్కొన్నారు. పీజీటీ-3, పార్ట్ టైం టీచర్- 3, అకౌంటెంట్-2, వార్డెన్- 2 పోస్టులకు అర్హులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు apkgvb.apcfss.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



సూర్యనారాయణ (పాత చిత్రం)

బి.కొత్తకోట, న్యూస్‌టుడే : బి.కొత్తకోట మండలం గుట్టమీదహరిజనవాడకు చెందిన సూర్యనారాయణ (25) అనుమానాస్పద స్థితిలో సోమవారం మృతి చెందారు. యువతితో ప్రేమ వ్యవహారమే కారణమని ప్రాథమికంగా పోలీసులు అంచనా వేశారు. వివరాలు.. మదనపల్లెలోని ఓ ఫొటోస్టూడియోలో పనిచేస్తున్న సూర్యనారాయణ గుట్టమీదహరిజనవాడలో ఓ యువతిని ప్రేమిస్తున్నారు. ఈ విష-ఇది యువతి తల్లిదండ్రులకు ఇష్టం లేదు. ఈ విషయమై యువతి కుటుంబ సభ్యులతో సూర్యనారాయణకు గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం తన సొంత ఇంట్లోనే యువకుడు విషం తాగారు. మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి కుటుంబ సభ్యులు తరలించగా అప్పటికే మృతిచెందారు. తన కుమారుడిని యువతి కుటుంబసభ్యులు తీవ్రంగా కొట్టి గాయపరిచారని, దీన్ని అవమానంగా భావించి విషం తాగాడని మృతుడి తండ్రి వెంకటరమణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని బి.కొత్తకోట సీఐ రాజారెడ్డి తెలిపారు.

వాహనం ఢీకొని బాలిక...

గాలివీడు : గాలివీడు-రాయచోటి ప్రధాన మార్గంలో ఆంజనేయపురం వద్ద రోడ్డు దాటుతున్న బాలికను వాహనం ఢీకొట్టడంతో మృతి చెందినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. ఎగువ గొట్టివీడు పంచాయతీ ఆంజనేయపురానికి చెందిన రమేష్ కుమార్తె మచ్చా హర్షిత (12) ఆదివారం రాత్రి రోడ్డు దాటుతుండగా రాయచోటి వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం తిరుపతి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందింది. బాలిక తల్లిదండ్రులు సోమవారం ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్సై వివరించారు.

అప్పులబాధతో యువకుడి ఆత్మహత్య



సాంబశివయ్య (పాత చిత్రం)

రామాపురం, న్యూస్‌టుడే: అప్పుల బాధ తాళలేక అనే ఓ యువకుడు విష ద్రావణం తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని సరస్వతిపల్లెకు చెందిన యనమల సాంబశివయ్య (30) అదే గ్రామానికి చెందిన యువతితో మూడేళ్ల కిందట ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఒక కుమారుడు సంతానం. ఈ నేపథ్యంలో సాంబశివయ్య ఏడాది కిందట రూ.80 లక్షలు అప్పు చేసి తిరుపతిలో బేకరీ ఏర్పాటు చేశారు. కొన్ని రోజులుగా నష్టాలు రావడంతో ఇటీవల దంపతుల మధ్య మనస్పర్థలొచ్చాయి. ఈ క్రమంలో అత్తింటి వారు పెళ్లి అనంతరం ఇచ్చిన డబ్బులు తిరిగివ్వాలని ఒత్తిడి చేయడంతో తీవ్ర వేదనకు గురయ్యారు. ఈ నెల 24వ తేదీ మన్నేరువాండ్లపల్లె సమీపానికి వెళ్లి సెల్ఫీ వీడియో తీసుకున్నారు. అప్పులు తీర్చలేకపోతున్నానని.. అత్తింటి వారి వేధింపులు ఎక్కువయ్యాయని చెబుతూ విషద్రావణం తాగారు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందారు. కేసు నమోదు చేశామని ఎస్సై వెంటసుధాకర్‌రెడ్డి తెలిపారు.

కష్టపడిన వారికి భాజపాలో తగిన గుర్తింపు

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: కష్టపడి పనిచేసిన వారికి భాజపాలో తగిన గుర్తింపు ఉంటుందని వైద్యారోగ్యశాఖామంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన సోమవారం సాయంత్రం ఎన్జీవో కాలనీలోని భాజపా కార్యాలయంలో పార్టీ కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తాను మంత్రి అవుతానని కలలో కూడా అనుకోలేదని, పార్టీ ఆదేశాలను తూచా తప్పకుండా పాటించడంతో ఈ స్థితిలో ఉన్నానని తెలిపారు. మోదీ హయాంలోనే భారతదేశం సుభిక్షంగా ఉందన్నారు. జిల్లాలో పార్టీ సభ్యత్వ నమోదులో వెనకంజలో ఉన్నామని, దీనిపై దృష్టిసారించాలని నాయకులను సూచించారు. గత అయిదేళ్లలో వైకాపా ప్రభుత్వం ఆరోగ్యశాఖను భ్రష్టు పట్టించిందని, దీనిని అనారోగ్యశాఖగా మార్చిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని మంత్రి ఆరోపించారు. భాజపా రాష్ట్ర నాయకులు బాలకృష్ణయాదవ్, మార్క్‌ఫెడ్ సభ్యుడు శశిభూషణ్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, బొమ్మన విజయ్, పవన్‌కుమార్, సుబ్బరాయుడు, రోశన్న, చేపూరి శారద, భానుప్రకాష్, బీరం సుబ్బారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, లక్ష్మణ్‌రావు తదితరులున్నారు.

వినతుల వెల్లువ...

కడప విద్య : విభజన చట్ట ప్రకారం కడప ఉక్కు పరిశ్రమకు కృషిచేయాలని సోమవారం మంత్రి సత్యకుమార్‌ను విద్యార్థి సంఘాల నాయకులు రవిశంకర్‌రెడ్డి, జయవర్ధన్, సుబ్బరాయుడు, శంకర్, నాగేంద్ర, ప్రశాంత్ తదితరులు కలసి వినతిపత్రం అందజేశారు.

★ రాష్ట్రంలో యునాని వైద్య కళాశాల స్థాపించాలని కోరుతూ మంత్రికి రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూట) నాయకులు వినతిపత్రం సమర్పించారు.

అరవిందనగర్ (కడప) : రిమ్స్ వైద్యకళాశాల విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంత్రి సత్యకుమార్‌కు తెలుగునాడు విద్యార్థి సమాఖ్య జిల్లా అధ్యక్షుడు తిరుమలేష్, నాయకులు వినతిపత్రం అందజేశారు.

మారుతీనగర్ : పులివెందుల మెడికల్ కళాశాలకు ఎంసీఏ ద్వారా కేటాయించిన ఎంబీబీఎస్ సీట్లను తిరిగి కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు మంత్రిని కోరారు.



మంత్రి సత్యకుమార్‌ను గజమాలతో సన్మానిస్తున్న నాయకులు, కార్యకర్తలు

మదనపల్లె

•మదనపల్లె •పీలేరు •తంబళ్లపల్లె

చెరువుల మరమ్మతులకు ఆందోళన


నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

ములకలచెరువు న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం వెంటనే చెరువులు, గ్రామీణ రోడ్ల మరమ్మతులు చేపట్టాలని సీపీఐ మండల కార్యదర్శి అంజనప్ప పేర్కొన్నారు. ములకలచెరువు ఎంపీడీవో కార్యాలయం ఎదుట సోమవారం సీపీఐ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ములకలచెరువు మండలం, సోంపల్లి పంచాయతీలోని నాయునివారిపల్లి, మేకలపాపన్నకుంటలకు మరమ్మతులకు చొరవ చూపే విధంగా అధికారులు కృషి చేయాలన్నారు. అనంతరం ఇన్‌ఛార్జి ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు.

ఉపముఖ్యమంత్రి దీక్షకు మద్దతు


మద్దతు తెలుపుతున్న కూటమి నాయకులు

నిమ్మనపల్లె, న్యూస్‌టుడే: ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన దీక్షకు సంపూర్ణమద్దతు తెలుపుతున్నట్లు జనసేన మండల ఉపాధ్యక్షుడు ఈటకట్ట చంద్రశేఖర్, తెదేపా మండల అధ్యక్షుడు పుర్రావెంకటరమణ పేర్కొన్నారు. సోమవారం స్థానిక అభయాంజనేయస్వామి ఆలయంలో శ్రీవారి లడ్డూ వ్యవహారంలో నిందితులకు శిక్షపడాలని జనసేన తెదేపా నాయకులు పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు శివ, సాంబశివ, భరత్, వంశీ, కృష్ణవేణి, శైలజ, రెడ్డెమ్మ తదితరులు పాల్గొన్నారు.

కడప- బెంగళూరు రైల్వేపనులు ప్రారంభించాలని నిరసన



మదనపల్లె సబ్‌కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : కడప నుంచి బెంగళూరు వయా మదనపల్లె మీదుగా చేపట్టిన రైల్వేపనులను ప్రారంభించాలని, మదనపల్లె పట్టణ ప్రజల దాహార్తిని తీర్చడానికి నిర్మించిన వేసవి జలాశయాల పెండింగ్ పనులను పూర్తిచేయాలని డిమాండు చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ మేరకు సోమవారం మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆ పార్టీ నియోజకవర్గం కార్యదర్శి మురళీ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత యూపీఏ ప్రభుత్వంలో కడప నుంచి మదనపల్లె మీదుగా బెంగళూరుకు రైల్వేలైను ఏర్పాటు చేయడానికి అనుమతులు జారీ చేసిందన్నారు. గత వైకాపా ప్రభుత్వం అలైన్‌మెంటును మార్చి ఈ ప్రాంతానికి తీరని అన్యాయం చేసిందని ఆరోపించారు. పదేళ్లుగా వేసవి జలాశయాల పనులు పూర్తికాలేదని తక్షణమే వాటి పనులు పూర్తి చేసి ప్రజలకు తాగునీటిని అందించాలని కోరారు. మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా చొరవ తీసుకుని నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరించాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో తిరుమల, సూరి, రెడ్డి, శోభ, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

రక్తదాతలు... ప్రాణదాతలు

నేడు జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం

మదనపల్లె వైద్యం, న్యూస్‌టుడే : వారంతా యువకులు.. సేవాగుణం కలిగిన వారు.. అందుకే స్వచ్ఛందసంస్థలో సభ్యులుగా చేరి సేవా కార్యక్రమాల్లో విరివిగా పాల్గొంటున్నారు. ఇందులో భాగంగానే రక్తదానం చేయడంలోనూ ముందుంటూ ఎంతో మందికి ప్రాణదానం చేస్తున్నారు. మదనపల్లెలోని 'హెల్పింగ్ మైండ్స్' సంస్థ సభ్యులు రక్తదానం చేస్తూ అందరికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఎక్కడ రక్తం అవసరం ఉన్నా వారు ముందుండి రక్తదానం చేస్తూ అందరి చేత ప్రశంసలు అందుకుంటున్నారు.


రక్తదానం చేస్తున్న హెల్పింగ్ మైండ్స్ సంస్థ సభ్యులు

ఆవశ్యకత తెలుసుకుని సంస్థ ఏర్పాటు



సుమారు 11 ఏళ్ల కిందట 'హెల్పింగ్ మైండ్స్' సంస్థను ఏర్పాటు చేశాం. ఆరుమందితో ప్రారంభమై ప్రస్తుతం వేలమందితో సంస్థ నడుస్తోంది. ఇప్పటి వరకు సంస్థలో ఉన్న 25వేల మంది వరకు రక్తదానం చేశారు. మదనపల్లెతో పాటు తిరుపతి, కర్ణాటక, మహారాష్ట్ర లలో సంస్థలను ఏర్పాటు చేశాం. ఇందులో వేల సంఖ్యలో సభ్యులు చేరారు. 'హెల్పింగ్ మైండ్స్ బ్లడ్ డోనర్స్' పేరుతో యాప్‌ను రూపొందించి అందులో సభ్యులుగా చేర్చి వారి పేరు పక్కనే బ్లడ్‌గ్రూప్ నమోదు చేయించాం. కళాశాలలో చదివే సమయం నుంచే రక్తదానం చేస్తున్నాను. ఇప్పటి వరకు 42 సార్లు రక్తదానం చేశాను. ఎక్కడ రక్తం అవసరం ఉన్నా అక్కడకు హెల్పింగ్ మైండ్స్ సంస్థ సభ్యులు అందిస్తున్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు రక్తదానం చేసి ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి సాయం అందివ్వాలి.

- అబుబకర్ సిద్దిక్, హెల్పింగ్ మైండ్స్ సంస్థ వ్యవస్థాపకుడు, మదనపల్లె

24 సార్లు రక్తదానం చేశా



'హెల్పింగ్ మైండ్స్' సంస్థ ఏర్పాటు చేసినప్పటి నుంచి సభ్యుడిగా ఉంటున్నాను. ఏటా మూడు సార్లు రక్తదానం చేస్తున్నాను. ఇప్పటి వరకు 24 సార్లు చేశాను. మదనపల్లె రక్తదాతల స్ఫూర్తితోనే నేను పనిచేసే పుంగనూరులో కూడా 'హెల్పింగ్ మైండ్స్' సంస్థ ఏర్పాటుకు కృషి చేసి వందల మందిని సభ్యులుగా చేర్పించాను. పుంగనూరులో ఎప్పుడు ఎవరికి రక్తం అవసరం ఉన్నా 'హెల్పింగ్ మైండ్స్' సభ్యులను సంప్రదించడం సంతోషంగా ఉంది.

- ప్రకాశ్, రక్తదాత, మదనపల్లె

ఆపదలో ఆదుకోవాలనే...



రక్తం అవసరం అయిన వారికి సాయం అందించాలనే 'హెల్పింగ్ మైండ్స్' సంస్థలో సభ్యుడిగా చేరాను. ఇప్పటి వరకు 18 సార్లు రక్తదానం చేశాను. రక్తదానం చేయడంతో పాటు నాతో పాటు స్నేహితులు చుట్టుపక్కల వారు రక్తదానం చేసేలా ప్రోత్సహిస్తున్నాను. ఒక సారి రక్తం ఇస్తే దాన్ని ముగ్గురికి వినియోగించుకోవచ్చు. ముగ్గురి ప్రాణాలు కాపాడినవారు అవుతాము. ప్రతి ఒక్కరు రక్తదాతలుగా మారాలి.

- భాస్కర్, రక్తదాత, మదనపల్లె

ప్రజలకు మెరుగైన సేవలు



బి.కొత్తకోట, న్యూస్‌టుడే : ప్రజలకు మెరుగైన సేవలను అందించడానికి కృషి చేస్తానని బి.కొత్తకోట సబ్ రిజిస్ట్రార్ వి.**వెంకటేశ్వర్లు** తెలిపారు. ఇప్పటివరకు బి.కొత్తకోట సబ్ రిజిస్ట్రార్‌గా ఉన్న పార్థసారధి కలికిరికి బదిలీపై వెళ్లారు. ఈయన స్థానంలో కడప-1 నుంచి వచ్చిన వి.వెంకటేశ్వర్లు ఇక్కడి కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఆస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను నిర్వహిస్తామని పేర్కొన్నారు.

రక్తదాన శిబిరం నేడు

కలికిరి (వాల్మీకిపురం), న్యూస్‌టుడే: వాల్మీకిపురం ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం ఉదయం స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఫైరోజాబేగం తెలిపారు. 18 నుంచి 50 ఏళ్ల లోపు యవతీయువకులు శిబిరంలో పాల్గొని రక్తదానం చేయాలని కోరారు.

విద్యార్థులకు పుస్తకాల అందజేత


విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న దాతలు

ములకలచెరువు న్యూస్‌టుడే: తంబళ్లపల్లె మండలం, కుక్కరాజుపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు దాతలు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా సోమవారం గ్రామానికి చెందిన దాతలు బావాజాన్(ఎన్ఆర్ఐ) శేఖర్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, తెదేపా నాయకుడు మదన్‌లు పాఠశాలలో నోటు పుస్తకాలు, ఇతర సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి సుమతి, హెచ్ఎం కృష్ణప్ప, సంఘమిత్రలు పాల్గొన్నారు.

దళితులకు న్యాయం చేయాలని వినతి


కలెక్టర్‌తో మాట్లాడుతున్న సీపీఐ పీలేరు నియోజకవర్గ కార్యదర్శి వెంకటేష్, నాయకులు

కలకడ, న్యూస్‌టుడే : మండలంలోని గర్నిమిట్ట పంచాయతీ మల్లారపువాండ్లపల్లె సమీపంలో ఇటీవల ఆక్రమంగా నిర్మించిన పునాదులను రెవెన్యూ అధికారులు తొలగించారని, వారికి న్యాయం చేయాలని సీపీఐ పీలేరు నియోజకవర్గ కార్యదర్శి వెంకటేష్, కలెక్టర్ శ్రీధర్‌కు విన్నవించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. పునాదులు తొలగించడంతో బాధితులు నష్టపోయారని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సేవలు అభినందనీయం


పాండురంగారావు దంపతులను సన్మానిస్తున్న చైర్‌పర్సన్ మనూజ, సిబ్బంది

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : పురపాలక సంఘం మేనేజరు పాండురంగారావు సేవలు అభినందనీయమని చైర్‌పర్సన్ వి.మనూజ కొనియాడారు. పాండురంగారావు ఉద్యోగ విరమణ సందర్భంగా సోమవారం రాత్రి కార్యాలయంలో ఆయనకు సిబ్బంది ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఛైర్‌పర్సన్ దంపతులకు శాలువ కప్పి, పుష్పగుచ్ఛం అందజేశారు. విధి నిర్వహణలో నిబద్ధతను చాటుకున్నారని, ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని సిబ్బంది పనిచేయాలన్నారు. అనంతరం కార్యాలయంలోని పలు విభాగాలకు చెందిన సిబ్బంది ఆయన్ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఈశ్వరనాయక్, డీఈఈ శ్రావణి, ఏఈఈ స్నేహప్రియ, వెంకట్, గిరిధర్, బాలగంగాధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీలేరు గ్రామీణ: తెలుగు సహాయకుడిగా ఆవుల పుల్లయ్య సేవలు ఆదర్శనీయమని గూడరేవుపల్లె సర్పంచి దండు జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. పీలేరు మండలం గూడరేవుపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు సహాయకుడిగా విధులు నిర్వహిస్తున్న పుల్లయ్య సోమవారం ఉద్యోగ విరమణ పొందారు. పుల్లయ్య, సరస్వతమ్మ దంపతులను శాలువాతో సత్కరించారు. ప్రధానోపాధ్యాయురాలు నాగరత్నమ్మ, నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు రెడ్డిరమేష్, తాటిపర్తి గంగాదర్, జయప్రకాష్‌నాయుడు, తెదేపా మండల ఉపాధ్యక్షుడు ఇతేష్, తదితరులు పాల్గొన్నారు.

తెదేపా కార్యకర్తలకు అండగా ఉంటాం


పీటీఎంలో కేకు కోస్తున్న నాయకులు

పెద్దతిప్పసముద్రం, న్యూస్‌టుడే: రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్ సభ్యురాలు ఫర్విన్‌తాజ్‌ను సోమవారం రేషన్ షాపుల డీలర్లు ఘనంగా సన్మానించారు. అనంతరం తెదేపా కార్యకర్తలు బస్టాండులో మన మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కేకు కోసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలకు ముఖ్యమంత్రి చంద్రబాబు న్యాయం చేస్తారన్నారు. ప్రభుత్వం వంద రోజుల్లో చేసిన అభివృద్ధి గురించి కూటమి కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి వివరించాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌కమిటీ మాజీ ఛైర్మెన్ ఓబులేశు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం


విద్యార్థినులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

గుర్రంకొండ, న్యూస్‌టుడే : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలో ఇంటర్ చదివి ఇటీవల విడుదలైన నీట్ ఫలితాల్లో ఎంపికైన ఫాతీమా, సయ్యద్ సాధియాలను కళాశాల్లో ప్రధానోచార్యులు నాయిని అమరేంద్రకుమార్ ఆధ్వర్యంలో ఘనంగా సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రోజారాణి, సుధాకర్ రెడ్డి, రమాదేవి, జమీర్, జాకీర్, రమణారెడ్డి, మనోహర్, సురేష్, వెంకటరమణ, భారతమ్మ, షఫీవుల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

నిందితులను అరెస్టు చేయాలని బంద్

రామసముద్రం, న్యూస్‌టుడే: దళితులపై దాడిచేసిన వారిని అరెస్టు చేయాలని రామసముద్రంలో బంద్ నిర్వహించారు. ఈ మేరకు రామసముద్రంలో సోమవారం దుకాణాలు మూతబడ్డాయి. బాధిత మద్దతుదారులతో పోలీసులు చర్చించారు. పట్టణ ప్రశాంతతకు సహకరించాలని కోరారు. అనంతరం పోలీసుస్టేషన్‌లో సీఐ రమేష్‌తో చర్చలు జరిపారు. బాధితునికి న్యాయం చేసి నిందితుల అరెస్టుకు చర్యలు తీసుకుంటున్నట్లు హామీ ఇచ్చారు. దీంతో బాధితుని మద్దతుదారులు శాంతించారు.


బాధితుడి మద్దతుదారులతో మాట్లాడుతున్న ఎస్.ఐ వెంకటసుబ్బయ్య

వినతులు స్వీకరించి... పరిష్కారానికి ఆదేశించి


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : సమస్యలు విన్నవించుకోవడానికి మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయానికి సోమవారం ప్రజలు తరలివచ్చారు. ఈ మేరకు సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ ప్రజల నుంచి అర్జీలు తీసుకుని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు 85 సమస్యలను సబ్‌కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఇందులో అత్యధికంగా భూ వివాదాలకు సంబంధించిన సమస్యలున్నాయి.

మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌కు పోటెత్తిన బాధితులు

పంచాయతీ అధికారులకు విన్నవించినా...



బి.కొత్తకోట మండల కేంద్రం పంచాయతీ వీధిలో చెత్తను వేస్తున్నారు. దీంతో దుర్వాసన వస్తోంది. ఈ సమస్యకు పరిష్కారం చూపాలని పలుమార్లు పంచాయతీ అధికారులకు కోరినా సమస్య పరిష్కారం కాలేదు. అందుకే సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశాను. **- రుక్మిణమ్మ, బి.కొత్తకోట**

భూ సమస్యపై ఫిర్యాదు చేశా...



తల్లిదండ్రుల ద్వారా సంక్రమించిన ఆస్తిని ముగ్గురు అక్కచెల్లెళ్లు సమానంగా భాగపరిష్కారం చేసుకున్నాం. తన భూమికి సంబంధించి 1బీ ఇవ్వలేదు. ఆన్‌లైన్‌లో చేర్చలేదు. దీనిపై పీటీఎం తహసీల్దారు కార్యాలయంలో విన్నవించినా పరిష్కారం కాలేదు. **- ఈశ్వరమ్మ, పీటీఎం మండలం**

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : విద్యార్థులు పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సప్తగిరి గ్రామీణ బ్యాంకు రీజనల్ మేనేజర్ ప్రకాష్ రత్నబాబు అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా సోమవారం జీఆర్‌టీ ఉన్నత పాఠశాల మైదానంలో ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ నవీన్, సిబ్బంది పాల్గొన్నారు.

పీలేరు : స్థానిక న్యాయస్థానాల ప్రాంగణంలో సోమవారం 11వ జిల్లా అదనపు న్యాయమూర్తి కె.మహేష్, సీనియర్ సివిల్ న్యాయమూర్తి కె.రవిల ఆధ్వర్యంలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం జరిగింది. న్యాయమూర్తులు న్యాయవాదులు, సిబ్బంది సంయుక్తంగా న్యాయస్థానాల ప్రాంగణంలోని పిచ్చిమొక్కలను తొలగించి శుభ్రం చేశారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు బీసీ పురుషోత్తం రెడ్డి, న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.

పీలేరు గ్రామీణ : కలికిరి సైనిక్ పాఠశాల ఎన్‌సీసీ విద్యార్థులు పీలేరు సమీపంలో పింఛా నదీ పరివాహక ప్రాంతంలో స్వచ్ఛతపనులు చేపట్టారు. ఎన్‌సీసీ ప్రోగ్రాం అధికారి వాంఖేడి, తదితరులు పాల్గొన్నారు.



స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో పాల్గొన్న సప్తగిరి గ్రామీణ బ్యాంకు సిబ్బంది


పీలేరు కోర్టు ప్రాంగణంలో శుభ్రం చేస్తున్న న్యాయమూర్తులు మహేష్, రవి

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన గ్యారంపల్లె క్రీడాకారులు



సౌత్ జోన్ పోటీలకు ఎంపికైన పీలేరుకు చెందిన హోత్రిశ్రీ (వృత్తంలో)

కంభంవారిపల్లె, న్యూస్‌టుడే : మండలంలోని గ్యారంపల్లె గురుకుల కళాశాల విద్యార్థులు వివిధ క్రీడల్లో 20 మంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ చెన్నకేశవులు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను అధ్యాపకులు సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, రమాదేవి, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

కలకడ : రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు మండలంలోని కోన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు చెంగల్‌రాయుడు సోమవారం సాయంత్రం తెలిపారు. మదనపల్లె బీటీ కళాశాల మైదానంలో గత నెల 28న జరిగిన జిల్లా స్థాయి ఎంపికలో బాలుర విభాగంలో యోగేశ్వర్, రెడ్డిప్రసాద్, సమీర్‌ఖాన్, జితేంద్ర, షారుఖాన్‌లు, బాలికల విభాగంలో ఫరహాన, సమీరలు ఎంపికైనట్లు పేర్కొన్నారు. పీడీ ఝాన్సీరాణి, విద్యార్థులను అభినందించారు.

సౌత్‌జోన్ పోటీలకు... : పీలేరు : పీలేరుకు చెందిన బ్యాడ్మింటన్ క్రీడాకారిణి హోత్రిశ్రీ అక్టోబరు 26న చెన్నైలో జరిగే సౌత్‌జోన్ పోటీలకు ఎంపికయ్యారు.

రహదారుల ఆక్రమణ... ట్రాఫిక్‌తో సతమతం

బి.కొత్తకోటలో చోదకులకు తిప్పలు


బి.కొత్తకోట జ్యోతి బస్టాండులో స్తంభించిన ట్రాఫిక్

బి.కొత్తకోట, న్యూస్‌టుడే : ట్రాఫిక్ సమస్యతో బి.కొత్తకోట వాసులు ఇక్కట్లు పడుతున్నారు. పట్టణంలోని జ్యోతి బస్టాండు, దిగువ బస్టాండులతో పాటు ప్రధాన కూడళ్లలో వాహనాల రాకపోకలు ఇబ్బందిగా మారడంతో ప్రయాణికులు అసహనానికి గురవుతున్నారు. పెరుగుతున్న వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని ముందస్తుగా ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టకపోవడంతో సమస్య సంక్లిష్టంగా మారుతోంది. మేజర్ పంచాయతీ నుంచి నగర పంచాయతీగా మారిన బి.కొత్తకోట జనాభా 30వేలు దాటుతోంది. అన్నమయ్య, శ్రీసత్యసాయి, వైఎస్ఆర్, అనంతపురం జిల్లాల్లోని వివిధ ప్రాంతాల నుంచి కర్ణాటకకు రాకపోకలు బి.కొత్తకోట మీదుగా సాగుతున్నాయి. ప్రత్యేకించి సిమెంటు లారీలు బి.కొత్తకోట మీదుగా బెంగళూరుకు వెళ్తుంటాయి. అయితే దీనికి తగ్గట్టుగా రహదారులను విస్తరించి, అభివృద్ధి చేయకపోవడంతో వాహనాల రాకపోకలు కష్టంగా సాగుతున్నాయి. స్థానిక పీటీఎంరోడ్డు మలుపులో భారీ వాహనాలు నిలిచి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆటోలు, కార్లతో పాటు ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేయడానికి ప్రత్యేకించి స్థలాలు కేటాయించకపోవడంతో రహదారులపైనే నిలుపుతున్నారు.

✤ పట్టణంలోని మెయిన్‌రోడ్డు, పీటీఎంరోడ్డు, బెంగళూరు రహదారులు ఆక్రమణకు గురయ్యాయి. రహదారులను సర్వే చేసి ఆక్రమణలను తొలగించాలన్న వివిధ వర్గాల సూచనలను అధికారులు పట్టించుకోలేదనే విమర్శలున్నాయి. ఇటీవల స్థానిక ప్రభుత్వాసుపత్రి వద్ద రహదారిపైనే బంకులను ఏర్పాటు చేస్తుండటంతో రహదారి ఇరుకుగా మారుతోంది.

✤ బి.కొత్తకోటలో ఆర్టీసీ, ప్రైవేటు బస్టాండుల నిర్మాణాన్ని ప్రారంభించడంలో జాప్యం చోటు చేసుకుంటోంది. దీంతో బస్సులను నడిరోడ్డుపైనే ఆపి ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. కొందరు డ్రైవర్లు బస్సులను ఎక్కడపడితే అక్కడ ఆపేస్తుండటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది.

✤ స్థానిక ఇందిరమ్మ కాలనీ నుంచి వర్రోళ్లపల్లె క్రాస్ వరకు ఇటీవల రహదారిని నిర్మించి చిన్నతరహా వాహనాలను పోలీసులు మళ్లిస్తున్నారు. ఈ మార్గంలో విద్యుత్తులైన్లు అడ్డంగా ఉండటంతో భారీ వాహనాల రాకపోకలు సాగించలేకపోతున్నాయి. విద్యుత్తు లైను ఎత్తును పెంచితేసిమెంటు లారీలు ఈ మార్గం గుండా రాకపోకలు సాగిస్తే పట్టణంలో చాలా వరకు ట్రాఫిక్ సమస్య తీరనుంది. ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడానికి బి.కొత్తకోట శివార్ల గుండా బైపాస్‌రోడ్డును నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

బి.కొత్తకోటలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడానికి తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి సారించాం. త్వరలోనే ఓ సమావేశాన్ని ఏర్పాటు చేసి వివిధ వర్గాలతో చర్చిస్తాం. అనంతరం ట్రాఫిక్ సమస్య పరిష్కారమయ్యేలా వాహనాల రాకపోకల్లో మార్పులు, చేర్పులు చేస్తాం. **- రాజారెడ్డి, సీఐ, బి.కొత్తకోట**

పెయింటర్‌పై దాడి

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : పెయింటర్‌పై చెప్పుల షాపు యజమాని దాడిచేసి గాయపరిచిన ఘటన మదనపల్లె పట్టణంలో సోమవారం జరిగింది. మదనపల్లె మండలం యనమలవారిపల్లెకు చెందిన అరుణ్‌కుమార్ పెయింటర్‌గా పనిచేస్తున్నారు. ఈయన బెంగళూరు బస్టాండు సమీపంలో చెప్పుల దుకాణం నిర్వహించే ఇర్ఫాన్ ఇంటికి పెయింటింగ్ వేసే పని ఒప్పుకున్నారు. ఈ పని కొంత ఆగిపోవడంతో ఇర్ఫాన్ గొడవపెట్టుకుని అరుణ్‌కుమార్‌పై దాడి చేసి, కులం పేరుతో తిట్టాడని బాధితుడు ఆరోపించారు. గాయపడిన అరుణ్‌కుమార్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు ఒకటోపట్టణ పోలీసులు విచారణ చేస్తున్నారు.

రోడ్డుప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొని ఇద్దరు తీవ్రంగా గాయపడిన ఘటన సోమవారం జరిగింది. మదనపల్లె పట్టణంలోని దేవతానగర్‌కు చెందిన కౌసర్ అన్సారీ పెద్దతిప్పసముద్రం మండలం కమ్మచెరువు ఉన్నత పాఠశాలలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఇతను పాఠశాల నుంచి ద్విచక్రవాహనంపై మదనపల్లెకు వస్తుండగా తట్టివారిపల్లె సమీపంలో ఎదురుగా వచ్చిన మరో ద్విచక్రవాహనం ఢీకొంది. ప్రమాదంలో కౌసర్ అన్సారీతో పాటు మరో ద్విచక్రవాహనంపై వచ్చిన నీరుగట్టువారిపల్లెకు చెందిన సాంబశివ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని స్థానికులు మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు విచారణ చేస్తున్నారు.

సారా విక్రయిస్తున్న మహిళ అరెస్టు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : సారా విక్రయిస్తున్న మహిళను సోమవారం అరెస్టు చేసినట్లు ఒకటోపట్టణ సీఐ చాంద్‌బాషా తెలిపారు. నక్కలదిన్నెకు చెందిన ఓ మహిళ ఇంట్లో సారా విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో తనిఖీలు నిర్వహించి ఆమె వద్ద నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. మహిళను అరెస్టు చేసి రిమాండుకు తరలించామన్నారు.

దంపతుల ఆత్మహత్యాయత్నం

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : పోలీసులు కొట్టారని ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నానికి యత్నించిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. పట్టణంలోని శివాజీనగర్‌కు చెందిన శంకర్ ప్రైవేటు బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. ఇతనికి అదే ప్రాంతానికి చెందిన అమ్ములుతో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. గతనెల 27వ తేదీన దంపతులు కుటుంబ విషయమై గొడవపడ్డారు. దీంతో ఆమె రెండోపట్టణ పోలీసులకు మహిళ ఫిర్యాదు చేశారు. భార్యాభర్తల మధ్య అమ్ములు కుటుంబ సభ్యులతో గొడవలు వస్తున్నాయని శంకర్ కూడా ఫిర్యాదు చేశారు. పోలీసులు ఇరువర్గాల వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఇందులో భాగంగానే శంకర్‌ను హెడ్‌కానిస్టేబుల్ కొట్టడంతో మనస్తాపానికి గురై అతను ఇంటికి వెళ్లి ఉరి వేసుకున్నట్లు ఆరోపించారు. తాడు తెగిపోవడంతో పడిపోయాడని ఈ విషయం తెలిసిన అమ్ములు కూడా అదే రోజు వాస్మల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారని వివరించారు. ఆమె తిరుపతిలో, శంకర్ ప్రభుతాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయమై రెండోపట్టణ సీఐ రామచంద్రను వివరణ కోరగా భార్యభర్తల మధ్య గొడవ జరగడంతో తాము కౌన్సిలింగ్ ఇచ్చి పంపించామని, కొట్టలేదని తెలిపారు.

ఉపాధ్యాయులకు బెదిరింపులు

గుర్రంకొండ, న్యూస్‌టుడే : మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఓ వ్యక్తి ఆర్టీఐ పేరిట బెదిరించినట్లు ఉపాధ్యాయవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. వివరాలు.. ప్రాథమిక పాఠశాలలకు వెళ్లి ఆర్టీఐ సంస్థను నడుపుతున్నామని, ప్రతి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రూ.500 చెల్లించాలని, లేని పక్షంలో మీ పాఠశాల వివరాలు అడుగుతామని, అందులో ఏదో ఒక లొసుగుతో ఉద్యోగం నుంచి తొలగించడానికి చర్యలు తీసుకుంటామని ఓ వ్యక్తి బెదిరిస్తున్నాడు. అమిలేపల్లె పంచాయతీలో బెదిరించి డబ్బులు వసూలు చేసినట్లు సమాచారం. ఈ క్రమంలో సోమవారం సంగసముద్రం పంచాయతీలో ఉపాధ్యాయుల దగ్గర రూ.500 డిమాండ్ చేశారు. ఈ విషయమై ఉపాధ్యాయులు సంఘ నాయకులు తెలిపారు.

రాయచోటి
• రాయచోటి • రాజంపేట • రైల్వేకోడూరు

చదువుతో పాటు నైపుణ్యాలు అవసరం

రామాపురం, న్యూస్‌టుడే : బిట్స్ విద్యాసంస్థల విద్యార్థులు మంచి నైపుణ్యాలు సాధించేందుకు యాజమాన్యం కృషి చేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శివప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం నిర్వహించిన స్వర్ణాంధ్ర విజన్ 2047 కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బిట్స్ కళాశాల ఒక మైలురాయిగా నిలుస్తుందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు నైపుణ్యాలు నేర్చుకోవడం ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టరు మన్నేరు భాస్కర్, ప్రిన్సిపల్ శివప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.


డీఈవో శివప్రకాశ్‌రెడ్డిని సన్మానిస్తున్న బిట్స్ డైరెక్టర్ భాస్కర్

బాల్యవివాహాలు ప్రోత్సహిస్తే కఠిన చర్యలు

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే : బాల్యవివాహాలు ప్రోత్సహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు బాల్య వివాహాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్న వయస్సులో వివాహం చేసుకుంటే ఎన్నో కష్టాలు అనుభవించాల్సి వస్తుందన్నారు. బాలికల సంరక్షణ కోసం 1098, 112, 100కు సమాచారమివ్వాలన్నారు. ప్రధానోపాధ్యాయురాలు రమణమ్మ, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, విద్యార్థినులు పాల్గొన్నారు.


విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న రాజ్యలక్ష్మి

చదువులో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: విద్యార్థులు కష్టపడి చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పేర్కొన్నారు. పట్టణంలోని శ్రీసాయి డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రిన్సిపల్ ముత్యాల పెంచలయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాలకు ఎమ్మెల్యేతో పాటు తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్యాల చంగలరాయుడు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశలో చదువు, క్రీడలపై పట్టు సాధిస్తే భవిష్యత్తులో మంచి ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు పొందొచ్చన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కళాశాల డైరెక్టరు శ్రీనివాసులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థులు

సురక్షితమేనా..!

● తాగునీటి నమూనాలు సేకరిస్తున్న అధికారులు
● పలుచోట్ల పైపులైన్ల లీకేజీలతో ప్రజల్లో ఆందోళన

– న్యూస్‌టుడే, రాయచోటి గ్రామీణ

రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని రోజులుగా వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. పలు ప్రాంతాల్లో ప్రజలు కలుషిత నీరు తాగడంతో డయేరియా బారిన పడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వసతి గృహాల్లో సైతం విద్యార్థులు కలుషిత నీరు తాగి డయేరియా బారిన పడిన ఘటనలూ ఉన్నాయి. ఈ నేపథ్యంలో మనం తాగేనీరు సురక్షితమేనా అని ఆందోళన చెందుతున్నారు.

● రాయచోటి నియోజకవర్గంలో గ్రామీణ నీటి సరఫరా విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్) అధికారులు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న నీటి వనరుల నుంచి నమూనాలు సేకరించి నీటి పరీక్షలు (బ్యాక్టీరియాలజికల్ కంటామినేషన్) చేపడుతున్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధిలో వ్యాధుల నివారణకు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య సేవలు సైతం అందిస్తున్నా... కొన్ని చోట్ల డయేరియా కేసులు నమోదవుతుండటం ఆందోళన కలిగిస్తోంది.

● రాయచోటి, గాలివీడు, చిన్నమండెం, సంబేపల్లె, లక్కిరెడ్డిపల్లె, రామాపురం మండలాల్లోని డీప్ బోర్ల నుంచి సంబంధిత అధికారులు నీటి నమూనాలు సేకరించి, ల్యాబుల్లో పరీక్షలు నిర్వహించారు. సేకరించిన నమూనాల్లో ఎలాంటి కలుషితం జరగలేదని తేల్చారు. అన్ని పరీక్షలు సాధారణంగానే ఉన్నట్లు చెప్పారు. బ్యాక్టీరియాలజికల్ కంటామినేషన్ ఫలితాలు సాధారణ స్థాయిలోనే ఉన్నాయని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో పైపులైన్‌లు అక్కడక్కడ పగిలిపోయి కలుషిత నీరు సరఫరా అవుతోందని పురపాలక వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటి పరీక్షలకు మంచి నీటిని తీసుకెళ్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మండలం	పరీక్షించిన డీప్‌బోర్ల నమూనాలు
రాయచోటి	80
గాలివీడు	102
,చిన్నమండెం	113
సంబేపల్లె	113
లక్కిరెడ్డిపల్లె	85
రామాపురం	103


రాయచోటిలోని ల్యాబ్‌లో నీటి పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ఎప్పటికప్పుడు పరీక్షలు చేస్తున్నాం

ఎప్పటికప్పుడు గ్రామాల్లో నీటి నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఎక్కడైనా వ్యాధులు ప్రబలుతున్నాయని తెలిస్తే వెంటనే ఆయా గ్రామాల్లో నీటి పరీక్షలు చేస్తున్నాం. నివేదిక ఆధారంగా చర్యలు చేపడుతున్నాం. ప్రస్తుతానికి నియోజకవర్గంలో ఎక్కడ నీరు కలుషితం కాలేదు.

– ప్రదీప్, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్

ఉదయగిరి ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు

రాజంపేట, న్యూస్‌టుడే: సనాతన ధర్మ పరిరక్షణకు ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టాలని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఇచ్చిన పిలుపు మేరకు జనసేన పార్టీ నాయకుడు యల్లటూరి శివరామరాజు తదితరులు పట్టణంలోని ఉదయగిరి ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి దీపాలు వెలిగించారు. పట్టణంలోని పర్వతవర్ధినీదేవి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో జనసేన పార్టీ నాయకుడు శివప్రసాద్ దీపాలు వెలిగించి ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టారు.

విక్రయదారులకు జరిమానా

రాయచోటి, న్యూస్‌టుడే : జిల్లాలో గడువు ముగిసిన ఆహార పదార్థాలు విక్రయించిన వారికి సోమవారం జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ జరిమానా విధించారు. నాసిరకం, గడువు ముగిసిన పదార్థాలు విక్రయించిన బేకరీలు, హోటళ్లు, శుద్ధినీటి కేంద్రం నిర్వాహకులకు రూ.42 వేల జరిమానా విధించారని జిల్లా ఆహార భద్రత అధికారి డాక్టరు కె.షమీమ్ బాషా సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆహార భద్రత ప్రమాణాల చట్టం ఉల్లంఘిస్తే రూ.5 లక్షల వరకు జరిమానా విధిస్తామన్నారు. హోటళ్లు, రెస్టారెంట్లు, ఇతర వ్యాపార దుకాణాల నిర్వాహకులు నిబంధనలకు లోబడి ప్రజలకు నాణ్యమైన సరుకులు, ఆహారం అందించాలని పేర్కొన్నారు.

నేటి నుంచి నిరసన దీక్షలు

రాజంపేట, న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం అక్టోబరు 1 నుంచి మూడు రోజులు పాటు రాష్ట్ర వ్యాప్తంగా నిరసన దీక్షలను చేపడుతున్నట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ తెలిపారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి మోదీ పాలన అధికారంలోకి వచ్చాక విశాఖ ఉక్కు పరిస్థితి మరింత దయనీయంగా మారిందన్నారు. పరిశ్రమ నష్టాల్లో ఉందని దాన్ని బడా పెట్టుబడిదారులకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.ఎస్.రాయుడు, పట్టణ కార్యదర్శి సికిందర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సాంబశివ, పక్కన నాయకులు

హేమకేశవులుకు ఉత్తమ అధ్యాపక పురస్కారం

రాజంపేట: ఏఐటీఎస్ ఈఈఈ విభాగంలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న డాక్టర్ హేమకేశవులుకి రాష్ట్ర ఉత్తమ అధ్యాపకుడిగా ఐఎస్‌టీఈ ఎంపిక చేసింది. 20 ఏళ్లుగా ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ విద్యారంగంలో సేవలందించినందుకు ఈ పురస్కారం లభించినట్లు హేమకేశవులు తెలిపారు. ఆయన్ను ఏఐటీఎస్ యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ చొప్పా గంగిరెడ్డి, ప్రొఛాన్సలర్ చొప్పా అభిషేక్‌రెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.మల్లికార్జున అభినందించారు.



చౌకదుకాణాల విభజనతో ఇబ్బందులు

రాజంపేట, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం వెయ్యి కార్డులున్న చౌక దుకాణాలను కుదించడంతో ఆర్థికంగా ఇబ్బందులు తలెత్తుతాయని చౌకదుకాణ డీలర్లు సోమవారం సబ్‌కలెక్టర్ నైదియాదేవికి మొరపెట్టుకున్నారు. వెయ్యి కార్డులున్న చౌక దుకాణం ద్వారా కమీషన్ రూపంలో రూ.15 వేలు వస్తుందని.. సంచులు విక్రయించుకోవడం ద్వారా మరో రూ.6 వేలు వస్తుందని, రెండూ కలిపినా రూ.21 వేలు మాత్రమే వస్తుందన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో కమీషన్ సగానికి పడిపోయే అవకాశముందని వాపోయారు.

రాజంపేట: ఏదైనా సమస్య ఉందని ప్రజలు వస్తే వారి సమస్యలను పరిష్కరించే దిశగా దృష్టి సారించాలని సబ్‌కలెక్టర్ అధికారులను ఆదేశించారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయ సభాభవనంలో సోమవారం డివిజన్‌లోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో విన్నవించుకున్నారు. భూఆక్రమణలు, ఇతర సమస్యలపై ఎక్కువగా అర్జీలు అందించారు.


సబ్‌కలెక్టర్ నైదియాదేవికి సమస్యలు విన్నవిస్తున్న చౌకదుకాణ డీలర్లు

సామాజిక సేవకు పురస్కారం

రాజంపేట, న్యూస్‌టుడే: వుయ్ ఆర్ విత్ యూ సంస్థను నెలకొల్పి వివిధ సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టిన ఏఐటీఎస్ ఈఈఈ విభాగం విద్యార్థులను గుర్తించి కడపకు చెందిన వెంకటలక్ష్మి ఛారిటబుల్ ట్రస్టు కడప సేవా రత్న అవార్డును ప్రదానం చేసింది. విద్యార్థులు చదువుకుంటూనే ఓ సంస్థను ఏర్పాటు చేసుకుని దాని ద్వారా వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా సేవాతత్పరతను చాటుకున్నారని ఏఐటీఎస్ ఈఈఈ హెచ్‌వోడీ డాక్టర్ పద్మలలిత, డాక్టర్ పి.గోపి వారిని అభినందించారు.


కడప సేవారత్న పురస్కారాన్ని అందుకుంటున్న ఏఐటీఎస్ విద్యార్థులు

ఎన్నికల హామీ అమలు చేయాలి

రాయచోటి : వాలంటీర్లకు కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేయాలని రాష్ట్ర వాలంటీర్ల సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. రూ.10 వేల వేతనంతో పాటు ఉద్యోగ భద్రత కల్పిస్తామని చెప్పి వంద రోజులు గడిచినా ఇప్పటి వరకు ఉద్యోగ భద్రత కల్పించలేదన్నారు. రాజీనామా చేసిన వాలంటీర్లతో సహా అందరినీ విధుల్లోకి తీసుకొని రూ.10 వేల వేతనం ఇవ్వాలని డిమాండు చేశారు. ఇప్పటికే వేతనాలు రాక వాలంటీర్ల కుటుంబాలు వీధిన పడుతున్నాయన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మహేష్, ఏఐవైఎఫ్ మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎస్.శ్రీనివాసులు, అసోసియేషన్ జిల్లా నాయకులు నరసింహులు, వెంకటరమణ, రెడ్డిరాణి, భార్గవి, చిన్న తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతోనే పోలీసులకు గుర్తింపు

రాయచోటి, న్యూస్‌టుడే: ఉత్తమ సేవలు అందించినప్పుడే పోలీసులకు గుర్తింపు లభిస్తుందని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు పేర్కొన్నారు. ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారులు, సిబ్బందిని సోమవారం ఆయన ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు దగ్గరగా ఉండేది పోలీసు ఉద్యోగమేనన్నారు. అభాగ్యులకు సేవ చేసే అవకాశం దక్కడం అదృష్టమన్నారు. 30 ఏళ్ల పాటు ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించడం అభినందనీయమన్నారు. ఉద్యోగ విరమణ పొందిన ప్రతి ఒక్కరూ కుటుంబంతో సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. అనంతరం ఉద్యోగ విరమణ పొందిన ఎస్సై వెంకటరమణ, ఏఎస్సైలు సుధాకర్‌బాబు, కాలేషాలను సత్కరించారు. కార్యక్రమంలో ఆర్ఐ ఎం.పెద్దయ్య, సిబ్బంది పాల్గొన్నారు.


ఉద్యోగవిరమణ పొందిన పోలీసులను సత్కరిస్తున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

‘రాజంపేట అభివృద్ధిని మరిచిన పాలకులు’

రాజంపేట, న్యూస్‌టుడే: పాలకులు రాజంపేట అభివృద్ధిని మరిచారని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పి.మహేష్ ఆరోపించారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలకులు అన్నమయ్య ప్రాజెక్టును నాశనం చేశారని.. ఇసుకాసురుల దాహానికి ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఇంత వరకు ఈ ప్రాంతం అభివృద్ధికి నోచుకోకపోవడం దారుణమన్నారు. అన్నమయ్య ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయాలని.. నందలూరు ఆల్విన్ ఫ్యాక్టరీ స్థానంలో ప్రత్యామ్నాయ పరిశ్రమను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి శివరామకృష్ణ, సహాయ కార్యదర్శి ఎం.ఎస్.రాయుడు, పట్టణ కార్యదర్శి సికిందర్, భవన నిర్మాన కార్మిక సంఘ నాయకుడు వెంకటయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మహేష్, పక్కన నాయకులు

రాష్ట్ర స్థాయిలో అండర్-19 కరాటే పోటీలు నేడు

రాజంపేట, న్యూస్‌టుడే: రాజంపేట ప్రభుత్వ కళాశాలలో అక్టోబరు 1న రాష్ట్రస్థాయి అండర్-19 కరాటే పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ అండర్-19 జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి శారద, కళాశాల ప్రిన్సిపల్ ఎస్.వి.రమణరాజు తెలిపారు. రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరుకానున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి ఆర్జేడీ రవి, డీఐఈవో కృష్ణయ్య, ఐపీఈ భానుమూర్తిరాజు హాజరుకానున్నట్లు వారు తెలిపారు.

పరిశ్రమలు ఏర్పాటు చేయండి

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే : వ్యవసాయాధారిత ప్రాంతమైన రైల్వేకోడూరులో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని కోరుతూ సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య సోమవారం తహసీల్దారు మహబూబ్‌చాంద్‌కు వినతిపత్రం అందజేశారు. రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో సమస్యను విన్నవించారు. పరిశ్రమలతోపాటు నియోజకవర్గంలో నిరుపయోగంగా మారుతున్న గొట్టిమానుకోన, వాగేటికోన, చాకిరేవుకోన వంటి జలవనరులను పునరుద్ధరించడం, రైల్వేకోడూరు పట్టణానికి భూగర్భ మురుగునీటి వ్యవస్థను నిర్మించి ప్రజలకు సమస్య లేకుండా చేయాలని కోరారు. నాయకులు గంగయ్య, రెడ్డెయ్య, సత్య, తేజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు విద్యార్థుల ఎంపిక

పుల్లంపేట, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ క్రీడాపోటీలకు పుల్లంపేట ఆదర్శపాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ లీలాశ్రీహరి, పీడీ నీలకంఠేశ్వరరావు తెలిపారు. సోమవారం రాయచోటిలోని మాసాపేటలో జరిగిన జిల్లా జట్ల ఎంపికలో ప్రతిభ చూపి అండర్-14, 17 బాలబాలికల విభాగంలో హేమంత్, సాంబశివుడు, జాస్మిన్ ఎంపికైనట్లు తెలిపారు. జాస్మిన్ అండర్-17 విభాగం బేస్‌బాల్, సాఫ్ట్‌బాల్‌లో, హేమంత్ అండర్-14 బేస్‌బాల్, సాంబశివుడు అండర్-17 సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. వీరు త్వరలో రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలకు జిల్లా జట్లు తరపున ప్రాతినిధ్యం వహిస్తారని వెల్లడించారు.


సాంబశివుడు హేమంత్ జాస్మిన్

ఉద్యోగ విరమణ తప్పనిసరి

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే: ఉద్యోగి జీవితంలో విరమణ తప్పనిసరి అని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. రాయచోటిలోని కె.రామాపురం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న కామినేని వెంకటరమణ సోమవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆయన్ను సహచర సిబ్బంది ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ.. ఎంతో మందికి నాణ్యమైన విద్యను అందించి ప్రయోజకులను చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగమునిరెడ్డి, నాగన్న, రామచంద్ర, లక్ష్మీనారాయణ సిబ్బంది, బంధు మిత్రులు పాల్గొన్నారు.


వెంకటరమణను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బంది, బంధుమిత్రులు

కుడికాలువ గేటు అమర్చాలని విన్నపం

సుండుపల్లి, న్యూస్‌టుడే: వై.ఆదినారాయణరెడ్డి పింఛ జలాశయ కుడికాలువ తూము గేటు అమరికకు సత్వర చర్యలు తీసుకోవాలని ముడుంపాడు గ్రామం ఎన్‌జెఆర్ కాలనీకి చెందిన ఉత్తమ రైతు అవార్డు గ్రహీత ఎం.అమృతనాయక్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో సోమవారం కలెక్టరు శ్రీధర్‌కు వినతి పత్రం అందజేశారు. 2021-22 సంవత్సరాలలో వచ్చిన భారీ వరదలకు పింఛ జలాశయ కుడివైపు ఉన్న మట్టికట్ట కొట్టుకుపోవడంతో పాటు కాలువ కూడా 400 మీటర్లకు పైగా దెబ్బతిందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గతేడాది పనులు ప్రారంభించి జలాశయ కట్టపునర్నిర్మాణం, కాలువ పునర్నిర్మాణం పూర్తి చేశారని అయితే జలాశయం నుంచి కాలువకు నీరు వదిలేందుకు గేటు అమర్చలేదని చెప్పారు.

ఆసుపత్రి మంజూరుకు విజ్ఞప్తి

నందలూరు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి మేజరు గ్రామ పంచాయతీలో ప్రభుత్వ వైద్యశాలను మంజూరు చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కలిసి విన్నవించినట్లు మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు జంబు సూర్యనారాయణ తెలిపారు. కడపలో సోమవారం ఆయన్ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ నాగిరెడ్డిపల్లి మేజరు గ్రామ పంచాయతీలో కుమ్మరపల్లి, ఇసుకపల్లి హరిజనవాడ, నారాయణరాజుపేట, అరవపల్లి, తొటపాలెం ప్రాంతాలలో 20 వేల జనాభా ఉన్నారని పంచాయతీ పరిధిలో ప్రభుత్వ వైద్యశాల లేక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని ఆసుపత్రిని మంజూరు చేస్తే పలు గ్రామాలకు ఉపయుక్తంగా ఉంటుందని విన్నవించామని చెప్పారు.


మంత్రి సత్యకుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న సర్పంచి సూర్యనారాయణ

రాష్ట్ర స్థాయి షాట్‌పుట్ పోటీలకు నాగిరెడ్డిపల్లె విద్యార్థి...

నందలూరు: నాగిరెడ్డిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి ఉస్మాన్ అలీఖాన్ ఇటీవల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడని ప్రధానోపాధ్యాయురాలు జయలలిత కుమారి తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థిని శాలువాతో సత్కరించి అభినందించారు.

అన్నమయ్య జలాశయాన్ని పునర్నిర్మించాలని వినతి

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: అన్నమయ్య జలాశయం మట్టికట్ట తెగిపోవడంతో ఆయకట్టుకు నీరందక పొలాలు ఎండిపోతున్నాయని.. పునర్నిర్మించేలా చూడాలని ముఖ్యమంత్రి నారాచంద్రబాబును కలిసి విన్నవించినట్లు తెదేపా నేత వెంటేశ్వర్లునాయుడు తెలిపారు. తాడేపల్లిలో సోమవారం ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసినట్లు చెప్పారు. రాజంపేట నియోజవర్గంలో తాగునీటి సమస్య అధికమైందని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరినట్లు వివరించారు.


సీఎం చంద్రబాబుతో తెదేపా నేత వెంకటేశ్వర్లునాయుడు

తక్కువ ఖర్చుతో పోషకాహారం

ఓబులవారిపల్లె, న్యూస్‌టుడే: శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషక మాసోత్సవాలను సోమవారం మంగంపేటలో ఘనంగా నిర్వహించారు. గర్భిణులు, చిన్నపిల్లలు తీసుకోవాల్సిన పోషకాహార పదార్థాలను స్టాళ్లలో ప్రదర్శించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు కూరగాయలు, పప్పు దినుసులు, పండ్లతో చేసిన ఆకృతులు ఆకట్టుకున్నాయి. సీడీపీవో సౌభాగ్యమ్మ మాట్లాడుతూ.. ఓబులవారిపల్లె మండలంలో మూడు సక్షం అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. అంగన్‌వాడీ పర్యవేక్షకులు అనుసూయమ్మ, నిర్మల, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రాజంపేట గ్రామీణ: మండల పరిధిలోని బ్రహ్మణపల్లి సెక్టార్ పరిధిలోని కొల్లావారిపల్లికి కేంద్ర ప్రభుత్వం నూతనంగా ఎంపిక చేసిన సక్షం అంగన్‌వాడీ కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ ప్రత్యేక పథకంతో కేంద్రంలో అన్ని రకాల వసతులు కల్పిస్తామమని అంగన్‌వాడీ పర్యవేక్షకులు తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి జయసింహ, అంగన్‌వాడీ కార్యకర్త పి.లక్ష్మీదేవి పాల్గొన్నారు.


పోషకాహార మాసోత్సవాలల్లో పాల్గొన్న గర్భిణులు, బాలింతలు, కూటమి నాయకులు

విద్యారంగ సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే: విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాజీలేని పోరాటం చేస్తామని ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పసుపులేటి కోటేశ్వరరావు అన్నారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ..కేంద్రం అవలంబిస్తున్న విద్యా విధానాలతో పేద, మధ్య తరగతి విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటర్మీడియట్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు పాల్గొన్నారు

పరిసరాల శుభ్రతపై అవగాహన

చిన్నమండెం: బాల్య వివాహాలను అరికట్టాలని ఎంఈవో శివానాయక్, మల్లూరు హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు రెడ్డెన్న, కొత్తపల్లె పీహెచ్‌సీ సీహెచ్‌వో వెంకటేశ్‌లు పేర్కొన్నారు. మల్లూరు పాఠశాలలో సోమవారం 8, 9, 10వ తరగతి విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఆడపిల్లలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. బాల్య వివాహాల వల్ల కలిగే దుష్పరిణామాల గురించి వివరించారు. ఉపాధ్యాయుడు రమణయ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమార్కులపై చర్యలకు వినతి

రామాపురం, న్యూస్‌టుడే: మండలంలోని పలుచోట్ల అక్రమంగా ఇసుక తవ్వకాలు జరిపి నిల్వ చేసుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని భాజపా నాయకులు సోమవారం తహసీల్దారు రామాంజనేయులుకు ఫిర్యాదు చేశారు. అనేక చోట్ల ఇసుక నిల్వలు ఉన్నాయని అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. గంప సుబ్బరాయుడు, శివ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వీరబల్లి వాసికి డాక్టరేట్ ప్రదానం

వీరబల్లి, న్యూస్‌టుడే: వీరబల్లికి చెందిన రాయని ప్రవీణ్‌కుమార్‌కు పశ్చిమ బెంగాల్ రాష్ట్రం దుర్గాపూర్‌లోని ఎన్ఐటి కళాశాల పీహెచ్‌డీ పట్టా ప్రదానం చేసింది. ఈ మేరకు అక్కడి విద్యాశాఖ మంత్రి మంజుదర్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు. ప్రివెంట్ డేటా థెఫ్ట్ ఫ్రం, స్మార్ట్‌ఫోన్స్, హిడెవలప్డ్ బిహేవియరల్ బయోమెట్రిక్స్ టు ఐడెంటిఫై ది జన్యూన్, స్మార్ట్‌ఫోన్ యూజర్‌పై చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ ఇచ్చారని ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు ఓటు హక్కు కల్పించాలి

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు కూడా ఓటు హక్కు కల్పించాలని ఆపస్ సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.నరసింహులు కోరారు. ప్రొద్దుటూరులో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం లక్కిరెడ్డిపల్లెలో ఆయన మాట్లాడారు.

గ్రామ సభలు నిర్వహించాలని వినతి

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే: రాష్ట్ర పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ఈ నెల 3న తప్పనిసరిగా అన్ని గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించాలని జనసేన పార్టీ జిల్లా నాయకులు రామశ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం డీపీవో ధనలక్ష్మికి వినతి పత్రం ఇచ్చారు. శ్రీనివాస్ మాట్లాడుతూ... గ్రామస్థుల సమస్యల పరిష్కారానికి గ్రామ సభలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన నాయకులు పాల్గొన్నారు.


డీపీవో ధనలక్ష్మికి వినతి పత్రం అందిస్తున్న జనసేన జిల్లా నాయకులు రామశ్రీనివాస్

సారూ... రోడ్లకు మోక్షమెప్పుడు?

అధ్వానంగా గ్రామీణ రహదారులు

పాలకులు మారినా ఆ గ్రామీణ ప్రాంత ప్రజల రాతలు మారలేదు. ఊరు పుట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు తారు రోడ్లు నిర్మించిన పాపాన పోలేదు. మండల కేంద్రం నుంచి పల్లెలకు వెళ్లాలంటే ఆటోలు, ప్రైవేటు, ద్విచక్ర వాహనాలలే దిక్కు. మండల పరిధిలోని కొత్తపల్లె మీదుగా మునిరెడ్డిగారిపల్లెకు రోడ్డు నిర్మాణ పనులు చేపడతామని ఏళ్ల నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులు చెబుతున్నారే తప్ప కార్యరూపం దాల్చిన దాఖలాల్లేవు. పాలెంగొల్లపల్లె పంచాయతీ హరిజనవాడ, కుర్నూతల పంచాయతీ మూలపల్లెకు, కాలా డివాండ్లపల్లెలకు ఇదే దుస్థితి నెలకొంది. కుర్నూతల పంచాయతీ ఎగువవడ్డెపల్లె నుంచి పందిళ్లపల్లె పంచాయతీలోని గ్రామాలకు రోడ్డు నిర్మాణం పనుల చేపట్టినా కొంత వరకు చేసి మధ్యలోనే ఆపేయడంతో గ్రామస్థులు రెండు కి.మీ. మేర కాలినడకన వెళ్లాల్సి వస్తోందని వారు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వమైనా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి చొరవతో రోడ్లు వేయించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

– న్యూస్‌టుడే, లక్కిరెడ్డిపల్లె


గుంతలమయంగా మూలపల్లె మార్గం


పాలెం హరిజనవాడకు వెళ్లే రోడ్డు ఇలా...

ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు

కట్టావారిపల్లి (పెనగలూరు): ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని మన్నారు సీఐ బీవీ రమణ, పెనగలూరు ఎస్సై రవి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. కట్టావారిపల్లి పంచాయతీ అప్పారాజుపేటలో సోమవారం ఆదివారం సీజ్ చేసిన ఇసుక డంపును పరిశీలించారు. అనంతరం తిరుణంపల్లిలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై అవగాహన కల్పించారు. గ్రామాలు ప్రశాంతంగా ఉండాలని సూచించారు. సిబ్బంది పాల్గొన్నారు.

ఊటుకూరు వద్ద లారీలు ఢీ

రాజంపేట గ్రామీణ: ఊటుకూరు వద్ద రెండు లారీలు పరస్పరం ఢీకొట్టుకున్నాయని స్థానికులు సోమవారం తెలిపారు. అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని వారు చెప్పారు. మన్నూరు పోలీసులను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.